ఆదివారం
ప్రజాశక్తి
జనవరి 20, 2002

బుల్లితెర - అదృశ్య చెర !

లోపలిపేజీలో
కులాతీత
వివాహ వేదిక

మరచిపోండి రంగురంగుల మందుల మాయాజాలాన్ని?

అందుకోండి ఆయుర్వేదపు అమృత భాండాగారాన్ని!

ఎసిడిటీ (గ్యాస్ ట్రబుల్) కి ఒక అద్భుత పరిష్కారం!

అవును - ఒరాసిడ్ యిది ఒక అద్భుత ఆయుర్వేద వనమూలికల సారము.

ఆధునికయుగంలో, కంప్యూటర్ స్పీడ్‌లో వేళాపాళాలేని భోజనపు అలవాట్లతో, మషాల దట్టించిన తిండితో, అజీర్ణం, కడుపులో మంటతో సతమతమవుతూ విలువైన ఆరోగ్యాన్ని అధోగతిపాలు చేసుకుంటూ, నివారణ కొరకు నిరీక్షిస్తూ ఎసిడిటీతో ఎందరో బాధ పడుతున్నారు. సరిగ్గా యిదే విషయం మీద మీ అభిమాన ఫిజికెమ్ ఎంతో శ్రమకోర్చి కఠిన పరీక్షలద్వారా నిర్ధారించబడిన అమృత తుల్యమైన ఒరాసిడ్‌ను మీకందిస్తుంది.

ఫిజికెమ్స్
ఒరాసిడ్

ప్రతి భోజనం తరువాత 2 టీ స్పూన్స్ (20 మి.లీ.) సేవించండి.
ఇది మీ జీర్ణకోశాన్ని, మిమ్ములను సదా పనిచేయిస్తూ వుంటుంది.

ఆయుర్వేదం : పూర్తి సురక్షితం
ఇది ఒజోమెన్ మరియు ఫిజి స్లిమ్ ఉత్పత్తిదారుల మరో విశిష్ట ఔషధం

ఫిజికెమ్ ఉత్పత్తులు పేరొందిన అన్ని మందుల షాపుల్లో లభిస్తాయి !

విషయమై మార్గదర్శకులుగా వుండాలి. పిల్లలు ఎండలో ఆడేప్పుడు వారు తగిన జాగ్రత్తలు తీసుకునేలా చూడాలి. 12 నెలల కన్నా తక్కువ వయస్సుగల శిశువులను ఎప్పుడూ నీడలోనే వుంచాలి. రక్షక దుస్తులు, టోపీ, సన్‌గ్లాసెస్ ధరించాలి. సన్‌స్క్రీన్ ఉపయోగించాలి. మిట్టమధ్యాహ్నం ఎండలో తిరగడం తగ్గించాలి. నీడలో వుండాలి. సన్‌ల్యాంప్స్, ట్యానింగ్ పార్లర్లకు వెళ్ళడం మానాలి. బీచ్, స్విమ్మింగ్ పూల్‌లతో బాటు, ఇంటి బాల్కనీ, వారాంతపు ప్రయాణాలు, జంతు ప్రదర్శనశాలను దర్శించడం, మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఆరుబయట ఆడినప్పుడు పిల్లలపై తీవ్రమైన సూర్యకాంతి పడే అవకాశం వుంది. పర్వత ప్రాంతాల్లోనైతే మరింత జాగ్రత్త వహించాల్సి వుంది. ప్రతి వేయి మీటర్ల ఎత్తుకు అతినీలలోహిత వికిరణ తీవ్రత ఎనిమిది శాతం పెర్గుగుతుంది. మేఘావృతం కాని సందర్భాల్లో కిరణాల తీవ్రత మరింత హెచ్చుగా వుండవచ్చు. మేఘావృతం అయినప్పటికీ తీవ్రత ఎక్కువగానే వుండవచ్చు. మంచు, ఇసుక, నీరు, సూర్యకిరణాలను పరావర్తనం చెయ్యడం వల్ల యు.వి. కిరణాల ప్రభావం ఎక్కువగానే వుండవచ్చు.

సూర్య కిరణాల తాకిడికి దుష్ప్రభావాల నుండి బయటపడడానికి ఈ విషయమై పిల్లలు, విద్యార్థులు, ప్రజల్లో తగిన అవగాహన కల్పించాల్సి వుంది. ఐక్యరాజ్య సమితి, పర్యావరణ కార్యక్రమం, ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ విషయమై పలు పరిశోధనలు, పరిజ్ఞానాన్ని అందరికీ అందుబాటులోకి తేవడానికి విస్తృత ఏర్పాట్లు చేయాలి. భావి తరాలైన నేటి పిల్లలను అతినీల లోహిత కిరణాల బారి నుండి కాపాడటం ఎంతైనా అవసరం. ★

డాక్టర్ సలహాలు

నా వయస్సు 27. నాకు కాస్త కోపం ఎక్కువ. దీని వల్ల రక్తపోటు వచ్చే అవకాశాలున్నాయని విన్నాను. ఇటీవల కాలంలో ఉప్పు తగ్గించాను. ఉప్పు తగ్గించడం వలన కోపం తగ్గే అవకాశాలు ఉన్నాయా? రక్తపోటు రాకుండా నివారించగలమా?

-వై. కొండలరావు, ఒంగోలు

కోపం శాంత స్వభావాలు మనసుకు సంబంధించినవి. కోపం ఒక్కటే రక్తపోటుకు కారణం కాదు. మీకు సమీపం లోని మానసిక వైద్యుడిని సంప్రదించి కోపం పోగొట్టుకునే అవకాశం ఉంది.

నా ఎడమకంటి దగ్గర ఎనిమిది నెలల క్రితం కురుపు అయ్యింది. వారం తరువాత వాపు, నొప్పి తగ్గినప్పటికీ చిన్న కురుపులాగా అలాగే ఉండిపోయింది. ఇది చూడటానికి అసహ్యంగా ఉంది. ఈ కురుపు పోవడం ఎలా?

-శ్రీజ్యోతి, విశాఖ

కురుపు మానిపోయేటప్పుడు చర్మంకింద గడుము కట్టే అవకాశం ఉంది. చూడటానికి అసహ్యంగా ఉంటే కంటివైద్యుని సంప్రదించి దానిని తొలగించుకునే వీలుంది.

(1) నాకు 5-6 నెలలుగా చుండ్రు సమస్య అధికమైంది. ఎన్నో రకాల షాంపూలు వాడినా తగ్గట్లేదు. శాశ్వత పరిష్కారం చూపండి?

(2) నా వయస్సు 17 సం॥ మూడేళ్ళుగా నా ముఖంపై మొటిమలు ఏర్పడుతున్నాయి. వీటికి చికిత్స ఏమిటో వివరంగా తెలపగలరు.

-సయ్యద్ అసిఫొద్దీన్, నిర్మల్

1. చుండ్రుకు శాశ్వత పరిష్కారం లేదు. తలకు నూనెరాయకుండా తరచూ తలంటుకుంటే కొంత ప్రయోజనం ఉంటుంది. చర్మవ్యాధులనిపుణుని సంప్రదిస్తే తీవ్రత తగ్గేందుకు సలహా ఇవ్వగలరు.

2. మొటిమలు తగ్గడానికి ఆహారంలో మార్పులు చేసుకుంటే మంచిది. కొవ్వు పదార్థాలూ, గడ్డకూరలు, తీపిపదార్థాలు తగ్గించాలి. రోజుకు నాలుగైదు సార్లు గోరువెచ్చని నీటితో ముఖాన్ని కడుక్కోవాలి. జిడ్డులేకుండా చూసుకోవాలి. మొటిమలు గిల్లవద్దు. రాత్రివేళ క్లియరాసిల్ క్రీమ్‌ను పూసుకుని మరునాటి ఉదయం సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. మందులు వాడవలసివచ్చినా, గడ్డలు కట్టిన చర్మాన్ని నునుపు చేసుకోవాలని అనుకున్నా విధిగా చర్మవ్యాధుల వైద్యుడిని సంప్రదించాలి.

నాకు ఎంత చదివినా గుర్తుండటం లేదు. జ్ఞాపకశక్తికి ఏమైనా మందు ఉందా?

-టి. బాలవెంకటేశ్వర్లు, పొదిలి

విషయాన్ని గుర్తుపెట్టుకోవడం ఎలా అనే ప్రశ్నకు వ్యక్తివికాసం తరగతులకు హాజరైతే సమాధానం దొరుకుతుంది. డాక్టర్ దయాకర్ ప్రైవేట్ ప్రాక్టీషనర్, నెల్లూరు అనే చిరునామాలో సంప్రదించండి. జ్ఞాపక శక్తిపెరిగేందుకు మందులు లేవు.

నా వయస్సు 27. చిన్నప్పటినుండి చెవిలో చీము కారుతోంది. మందులు వాడినప్పుడు మామూలుగా ఉండేది. నాకు టాన్సిల్స్ కూడా ఉన్నాయి. 95-96లో టాన్సిల్స్‌కు ఆపరేషన్ చేశారు. అప్పటినుండి కుడి చెవిలో మాత్రమే చీము కారుతోంది. డాక్టర్ దగ్గరకు వెళ్తే ఆపరేషన్ చేయాలన్నారు. చెవులు సరిగా వినపడటం లేదు. చికిత్సకు ఖర్చు ఎంత అవుతుంది? తగిన సలహా ఇవ్వగలరు.

-జి. నరేందర్, భద్రాచలం

చెవి ఆపరేషన్ జనరల్ హాస్పటల్‌లో ఉచితంగా చేస్తారు. ప్రైవేటు ఆసుపత్రిలో అయితే మూడువేలనుంచి 20వేల దాకా ఆసుపత్రిని స్థాయినిబట్టి వసూలు చేస్తున్నారు.

- డా॥ కొల్లా నాగేశ్వరరావు,
ఎం.ఎస్., డి.ఎల్.ఓ., ఒంగోలు

ప్రేమరాహిత్యం

అంపశయ్య నవీన్

“స కుటుంబ సమేతంగా ఎక్కడికో వెళ్ళొస్తున్నట్టున్నారు?” అన్నాను అప్పుడే కారు దిగి ఇంట్లో ప్రవేశించబోతున్న మా పక్కింటి పుల్లారావుతో.

“ఏదో కొత్త సినిమా వచ్చింది - అందరూ చాలా బావుందంటున్నారు.... వెళ్ళొద్దాం... మీరు కూడా రావాలి తాతయ్యా అని మా మనవరాలు పట్టుబడితే ఆ సినిమాకెళ్ళొస్తున్నామండి.....” అంటూ పుల్లారావు మా ఇంటివైపొచ్చాడు.

“సినిమా ఎలా ఉంది?”

“మనం యువకులుగా ఉన్న రోజుల్లో వచ్చిన సినిమాలకు, ఇప్పటి సినిమాలకు అస్సలు పోలికే లేదండి - ఎన్ని మార్పులొచ్చాయో... నన్ను ఆశ్చర్యపరచిన విషయమేమిటంటే... టీవీల్లో మల్టీ ఛానెల్స్ వచ్చాక ఇక సినిమాలెవరూ చూడరనుకునే వాళ్ళు కదా... సినిమాహాల్సన్నీ మూతబడిపోతాయనుకున్నారు కదా! అలాంటిదేమీ జరగలేదు.... ఇవ్వాళ్ళ మేం వెళ్ళిన సినిమాకు జనం విరగబడ్డారనుకోండి... టికెట్లు దొరక్క చాలా మంది ఇళ్ళకు వెళ్ళిపోయారు.... పోనీయ్ ఈ సినిమా ఏమన్నా నిన్ననో, మొన్ననో రిలీజయిందనుకుంటున్నారా? ఈ సినిమా రిలీజై యాభై రోజులు దాటిపోయాయట.... అయినా జనం ఇంతగా విరగబడి ఆ సినిమా చూస్తున్నారంటే సినిమా పట్ల ప్రజలకున్న మోజు ఏ మాత్రం కూడా తగ్గలేదనే అనుకోవాలి కదా...”

“అవును.. ఈ మధ్య విడుదలైన చాలా తెలుగు సినిమాలు బాగా ఆడుతున్నాయని నేనూ వింటున్నాను. ఇంతకూ మీరు చూసొచ్చిన సినిమా ఎలా ఉందో చెప్పనే లేదు...”

“చెబుతున్నాను గదా... ఒకప్పటి సినిమాలకూ, ఇప్పటి సినిమాలకూ పోలికే లేదు. ఆ రోజుల్లో ప్రతి సినిమాలోనూ ఏ.ఎన్.ఆరో, ఎన్.టి.ఆరో తప్పకుండా ఉండాల్సిందే... వాళ్ళు అరవయ్యోడిలో పడ్డాక కూడా కాలేజీలో చదివే కుర్రాళ్ళుగా వేషం వేసినా మనం నోరుమెదపకుండా చూసేవాళ్ళం... ఇప్పుడా రోజులు పోయాయి... ఇప్పుడు కాలేజి విద్యార్థిగా వేషం వేసేవాడు అచ్చం కాలేజీ కుర్రాడిగానే ఉంటున్నాడు... ఇప్పుడు యాభయ్యేళ్ళ వాడో, అరవయ్యేళ్ళవాడో కాలేజీ కుర్రాడిగా వేషం వేస్తే ఆ సినిమాను ఎవ్వరూ చూసేట్టు లేరు. ఇవ్వాళ్ళ ఏ సినిమా చూసినా ఇరవయ్యేళ్ళ కుర్రాళ్ళే హీరోలుగానూ, హీరోయిన్లుగానూ కనిపిస్తున్నారు... అలాగే ఏ సినిమాలో చూసినా ఓ కాలేజి... కాలేజీ విద్యార్థులు.. కాలేజీలో పని చేసే లెక్చరర్లు... ప్రిన్సిపాళ్ళు ప్రధాన పాత్రలుగా కనిపిస్తున్నారు. వెనకటి సినిమాల్లో కాలేజీలో చదివే హీరో ఎంత బుద్ధిమంతుడుగా కనిపించేవాడు... తప్పకుండా ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యేవాడు. ఇప్పటి హీరోలు అస్సలు పుస్తకాలు చదవరు. శుభ్రంగా పరీక్షల్లో ఫెయిలవుతారు... వెనకటి సినిమాల్లో హీరో హీరోయిన్లు ఒకర్నొకరు ఎంతో గౌరవించుకుంటూ ప్రేమించుకునేవాళ్ళు... ఇప్పటి సినిమాల్లో హీరో హీరోయిన్లు ఒకర్నొకరు తిట్టుకుంటారు. కొన్నిసార్లయితే బండబూతులు తిట్టుకుంటారు. కొట్టుకుంటారు... ఆ కొట్లాటలోంచే, ఆ తిట్టుకోవటంలోంచే వాళ్ళ మధ్య ప్రేమ పుడ్తుంది... అంత దారుణంగా తిట్టుకొని, కొట్టుకున్న వాళ్ళు చివర్లో ఒకరి కోసం ఒకరు కన్నీళ్ళు కార్చటం చూస్తే చాలా ఆశ్చర్యం కలుగుతుంది. మరో విషయమేమిటంటే హీరో హీరోయిన్లు ఎప్పుడూ కలిసే తిరుగుతున్నా, ఇద్దరిమధ్యా ప్రేమలాంటిది ఏర్పడినా “నేను నిన్ను ప్రేమిస్తున్నాన”ని అతడూ చెప్పడు...



ఆమే చెప్పదు. అలా ఒకరితో ఒకరు “చివరి క్షణం దాకా ఐ లవ్ యూ!” అని చెప్పుకోకపోవడం వల్ల వాళ్ళు విడిపోయే ప్రమాదం ఏర్పడుతుంది. వీళ్ళెక్కడ విడిపోతారోనని, వీళ్ళు విడిపోకపోతే బావుండునని ప్రేక్షకులుగొప్ప ఉత్కంఠతో ఊపిరి బిగబట్టుకొని సినిమా చూస్తుంటారు.... పూర్వపు సినిమాల్లో ప్రేమికులు విడిపోవడానికి ఎన్నో కారణాల్ని చూపించే వాళ్ళు... హీరో అగ్రకులానికి చెందిన వాడు కావడమో, హీరోయిన్ తక్కువ కులానికి చెందింది కావడమో... లేక అమ్మాయి బాగా డబ్బున్న వాళ్ళ కుటుంబానికి చెందింది కావడం... అబ్బాయి పేద కుటుంబానికి చెందిన వాడు కావడం... లేక వాళ్ళక్క కూడా ఆ అబ్బాయినే ప్రేమించడంవల్ల చెల్లెలు అక్కకోసం తన ప్రేమను త్యాగం చెయ్యడం.... ఇలాంటి కారణాల వల్ల ఎంతో గాఢంగా ప్రేమించుకున్న ఆ అబ్బాయి, ఆ అమ్మాయి కొంతకాలం విడిపోయే వాళ్ళు... కానీ ఇప్పటి సినిమాల్లో అబ్బాయి, అమ్మాయి విడిపోవడానికి ఇవేవీ కారణాలు కావడం లేదు.... అబ్బాయి అమ్మాయితో నేను నిన్ను ప్రేమిస్తున్నాను” అని సకాలంలో చెప్పకపోవడమొక్కటే వాళ్ళిద్దరూ విడిపోవడానికి... అంటే ఆ అమ్మాయి మరో అబ్బాయిని పెళ్ళి చేసుకోవడానికి సిద్ధం కావడం, ఆమెను ప్రేమించిన అబ్బాయే లోలోపల ఏడుస్తూనే ఆమె పెళ్ళికి అన్ని ఏర్పాట్లు చెయ్యడం, మనందరం “అయ్యో పాపం!” అనుకుంటూ ఆ అబ్బాయి మీద బోల్డు జాలిపడిపోవడం... సరే... చివరకు ఆ అబ్బాయి, అమ్మాయి కలుసుకోవడం... ఐలవ్‌యూ అని చెప్పేసుకోవడం.... కథ సుఖాంతం కావడం జరుగుతుందనుకోండి... ఇప్పటి సినిమాల్లో నేను గమనించిన మరో కొత్తదనమేమిటంటే డైలాగులు - పూర్వపు సినిమాల్లో డైలాగులు కథను నడిపించడానికి, పాత్రల స్వభావాన్ని తెలియచేయడానికి తోడ్పడేవిగా ఉండేవి. హాస్యాన్ని హాస్యనటులకే వదిలేసేవారు. కానీ ఇప్పటి సినిమాల్లో ప్రతి డైలాగ్‌లోనూ ఓ మెరుపునో, ఓ చమత్కారాన్నో చూపిస్తున్నారు... ఇప్పటి సినిమాల్లో ప్రతి పాత్రా హాస్యాన్ని సృష్టించే డైలాగుల్ని చెబుతున్నారు. డైలాగ్ డైలాగ్ కోసమే అన్నట్టుగా... ప్రతి మాటలో ఓ చెమక్కును చూపించే ప్రయత్నం చేస్తున్నారు... భార్య భర్తమీద, భర్త భార్యమీద, లెక్చరర్ ప్రిన్సిపాల్ మీద, ప్రిన్సిపాల్ లెక్చరర్ మీద, బాస్ సబార్డినేట్ బాస్ మీద టిట్ ఫర్ టాట్ లాగ విసుర్లు విసురుకోవడమే... డైలాగులూ కథను ముందుకు తీసుకుపోయే బదులు కథకు అడ్డు తగులుతుంటాయి.... అసలు ఇప్పటి సినిమాల్లో కథ అనేది చాలా తక్కువగా ఉండటం మరొక ముఖ్యమైన మార్పనుకోండి. కుర్రకారుకు సంబంధించి చాలా చిన్నకథను తీసుకొని డైలాగులతో, పాటలతో, హాస్యంతో, డాన్సులతో నింపేస్తూ, చూస్తున్న ప్రేక్షకుడ్ని మెస్మరైజ్ చేస్తూ, ఎక్కడా విసుగు కల్గించే సన్నివేశం లేకుండా స్పెషల్ ఎఫెక్ట్ బాగా దట్టించి ఇవ్వాళ్ళ సినిమాలు తీస్తున్నారు - జనం వాటినిబాగా చూస్తున్నారు - అయితే ఒక విషయంలో మాత్రం తేడా లేదు - అప్పుడూ ప్రేమ కథలే విజయవంతమయ్యాయి... ఇప్పుడూ ప్రేమ కథలే విజయవంతమయ్యాయి... జనం ప్రేమ కథలంటే ఇంతగా ఇష్టపడటానికి కారణమేమిటంటారు?” అన్నాడు పుల్లారావు.

“అప్పటి సినిమాలకీ, ఇప్పటి సినిమాలకీ మధ్య ఉన్న వ్యత్యాసాల్ని మీరు భలేగా చెప్పారు.. అయితే ప్రేమ కథల్నే జనం - అప్పుడు గానీ, ఇప్పుడుగానీ ఆదరించడానికి కారణం ఒక్కటే... నిజ జీవితంలో ప్రేమ చాలా మందికి - నూటికి తొంభైతొమ్మిది మందికి - లభించదు. ప్రతి ఒక్కరిలోనూ నన్ను ప్రేమించే ఓ అందమైన అమ్మాయుంటే బావుండుననీ, అబ్బాయికి, అబ్బాయుంటే బావుండునని అమ్మాయికీ ఉంటుంది. ఆ కోరిక నిజజీవితంలో తీరదు. దాన్ని సినిమాలో చూస్తూ, ప్రేమించుకుంటున్న హీరో హీరోయిన్లతో ఐడెంటిఫై అవుతూ ఆ కాస్సేపన్నా తమలోని ఆ తీరని కోరిక తీరుతున్నట్టుగా ఫీలవుతారు. వాస్తవ జీవితంలో ప్రేమ లభించకపోవడమే ప్రేమ కథల్ని ప్రజలు ఇంతగా ఆదరించడానికి కారణం” అన్నాన్నేను. ★

మీ చిన్నారులకు జన్మదిన శుభాకాంక్షలు తెలియచేయాల... ...లు. ఐదేళ్ల వయస్సు వరకు గల చిన్నారులందరికీ ఈ 'హ్యాపీ బర్త్‌డే' శీర్షిక కింద ఉచితంగా శుభాకాంక్షలు తెలియచేస్తాం. దీనికి మీరు చేయవలసిందల్లా మీ చిన్నారి పుట్టినరోజుకు నెల రోజుల ముందుగా వివరాలు పంపడమే. **మీ చిన్నారి పేరు, వయస్సు, పుట్టినతేదీ, తల్లిదండ్రుల పేర్లు, ఊరిపేరు తదితర వివరాలతో ఓ కలర్‌ఫొటో జతచేసి పంపాలి.** మీ చిన్నారి పుట్టినరోజు ఉన్న వారంలో వెలవడే ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలో ఫొటో, వివరాలు ప్రచురించడం జరుగుతుంది. మీకు ఎంతో ఆనందం కలిగించే మీ ఇంటి దీపాల పుట్టిన రోజు వేడుకలను ప్రజాశక్తి అభినందనలతో జరుపుకోండి.

ఇట్లు
ఎడిటర్

పంపవలసిన చిరునామా: హ్యాపీబర్త్‌డే, కేరాఫ్ సండే సెక్షన్, ప్రజాశక్తి కార్యాలయం, స్ట్రీట్ నెం : 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20 ఫోన్ : 7673787, 7665420

ఒక జడ్జి- ముగ్గురు దోషులు

ఒక కోర్టులో జడ్జి ఎదురుగా ముగ్గురు దోషులు నిల్చొని ఉన్నారు. జడ్జి మొదటి వ్యక్తి వైపు చూస్తూ 'నీవు చెప్పుకోవాల్సింది ఏమైనా ఉందా' అని అడిగాడు. దానికి వెంటనే రెండో వ్యక్తి జవాబు ఇస్తూ 'నేను ఈ నేరం చేయలేదు' అన్నాడు. సమాధానం విన్న వెంటనే జడ్జి రెండో వ్యక్తి వైపు చూస్తూ 'నేను నిన్ను అడగలేదు' అన్నాడు. దానికి మూడో వ్యక్తి బదులు ఇస్తూ 'అసలు నేనేం మాట్లాడలేదు సార్' అన్నాడు. జడ్జికి అతి సమీపంలోనే ఆ ముగ్గురు దోషులు ఉన్నప్పటికీ ఇలా చిత్రమైన జవాబులు ఎందుకు వచ్చాయో ఆలోచించండి.

చిరునామా
బాలనేస్తాలు
కేరాఫ్ సండేసెక్షన్,
ప్రజాశక్తి దినపత్రిక
కార్యాలయం,
డో.నెం. : 1-1-298/4,
స్ట్రీట్ నెంబర్ 1,
అశోక్‌నగర్,
హైదరాబాద్-20

మాటలకోట-40

1		✿	2	✿	3	4		5	
	✿	6	✿	7	✿		✿		✿
8	9		10	✿	11		12	✿	13
✿		✿	14			✿	15	16	
17		18		✿	19	20	✿		✿
	✿		✿	21	✿	22	23	✿	24
25	26	✿	27			✿	28		✿
✿	29	30			✿	31		✿	32
33	✿		✿	34	35	✿	36	37	
38				✿	39		✿		✿

అడ్డం

1. జడ, ఊడ (2)
2. 'సం' చేరిస్తే నెల (1)
3. ఇతనికి కూడా ఉపకారం చేయమన్నాడు సుమతీ శతకకారుడు (5)
7. 'హి' తో భూమి (1)
8. విభజన...3,4,2,1 (4)
11. భూమి (3)
14. రాముడికి ఎంగిలి పండు ఇచ్చింది ఈమే (3)
15. నిలువు 12లో మలిభాగం, తంతువులో చివరి రెండక్షరాలు కలిస్తే... (3)
17. విజయవంతం (4)
19. వేడి, మంట (2)
22. స్థితి, స్థాయి (2)
24. 'క' చేరిస్తే గుంపు (1)
25. బరువు (2)
27. తొలి తిధి (3)
28. శిరస్సు (2)
29. ఖడ్గం, కత్తి (4)
31. విరామచిహ్నం (2)
34. చేపలు దీంతో పట్టొచ్చు (2)
36. బహువచనంలో నంది (3)
38. తడబడ్డ గడబిడ (4)
39. పెళ్ళి కాని యువతి (2)

నిలువు

1. నీటిలో పుట్టింది, ఎటు చదివినా ఒకటే (3)
4. బోట్ (3)
5. ఖాళీ (2)
6. కాంతి (2)
9. యమున తిరగబడింది (3)
10. స్పష్టం, విపులం (3)
11. ఒక పిండి వంటకం (3)
12. సత్యం (2)
13. గోవు (2)
16. సమూహం (2)
17. జనసంఖ్య (3)
18. కృష్ణన్ (2)
20. పౌరాణిక చిత్రాల్లో కనిపించే ఆయుధం (2)
21. భద్రంగా, దృఢంగా (4)
23. '....' భవతి అని పెళ్ళిలో చదివే ఓ మంత్రం (4)
26. కింది నుండి చేయి (2)
27. చివర కోల్పోయిన పెళ్ళి (2)
30. వివాదం (3)
32. పొలాలు (2)
33. ఇల్లు అలుకుతూ పేరు మర్చిపోయింది ఇదే (2)
35. రావణాసురుడి రాజ్యం (2)
37. అత్త మీద కోపం దీని మీద చూపిస్తే ఎలా? (2)

గతవారం జవాబులు : *అడ్డం :* 1. సమాసం 3. జ 4. జీ 5. గది 6.క్రాంతి 8. వడి 9. అతి 10. బతిమాలు 11. జ్వ 12. లోభి 13. ముట్టడి 14. వరం 16. వంతెనలు 18. గమ్ 19. పొద 20. కౌగిలింత 22. నంతం 24. గన్ 27. తిమిరం 29. పాతం 30. దరి 31. నావ 32. దారి 33. అమితం 34. నందనం **నిలువు :** 1. సతి 2. సంక్రాంతి 5. గడి 7. కుతిడి 8. వలువ 9. అభివందనం 10. బట్టలు 13. మునక 15. రంగత 17. అంగి 20. కౌన్ 21. లింఖితం 23. తంతి 24. గరం 25. పోకిరి 26. ఉదరం 28. మిసిమి 29. పావనం 32. దానం

ఎన్నెన్ని ? : మొదటి గ్రూపులో 5, రెండో గ్రూపులో ఏడు పక్షులు ఉంటాయి.

ఎందుకలా ? : ఇద్దరూ ఎదుటి వ్యక్తిలాగే తన ముఖం కూడా ఉందనుకోవడం వల్లే వారు అలా చేస్తారు.

శంభో రాజ ప్రదీపా..!

రుక్మిణి

"అన్నా! 'శంభో రాజ ప్రదీపా' అంటే ఏందే - ఏంభాషే? ఓర్నీ.. అస్సలర్థమై చావడంలేదు" జక్కులోడు బుర్ర గీక్కుంటూ అడిగాడు. యాద్గిరి బీడీ వెలిగించి చప్టామీద కూలబడ్డాడు.

"రాత్రి వీధి బాగోతం వేస్తే చూడబోయిం! ప్రహ్లాదుడి బాగోతం... అబ్బో.. హిరణ్య కశిపుడూ.. ఆయన గారి రాణీగారూ... పద్యాలు... వాయిద్యాలు అన్నీ మంచిగనే వున్నయిగానీ.. మధ్య మధ్యలో ఈ 'శంభో రాజ ప్రదీపా' అని అరవడం... అదీ బాగానే అనిపించింది గానీ... అసలదేందే?" జక్కులోడు యాతనపడుతూ బుర్ర గోక్కున్నాడు.

"అదికాదే అన్నా.. హార్మని గుయ్..గుయ్‌లు.. తబలా దెబ్బలు.. రంగులైట్ల చక్రం బాగనే వున్నయి. వెలిసినవో కిలుంపట్టినవో గదలూ.. కత్తులూ.. కిరీటాలు నరేనరి! ఊం అంటె పాటలు.. వద్యాలకు తగులుకున్నారుగానీ.. అసలు గదేందో అర్థం కావడంలేదే!" యాద్గిరి కదు విచారంగా అన్నాడు.

"ఇంకో మాట అన్నా - గా మాట ఒకసారి కేతిగాడు అరుస్తడు - మళ్ళోసారి మంత్రిగాడు అరుస్తడు. మరోసారి హిరణ్య కశిపుడుగారి పెండ్లాం అరుస్తది. చివరికి భక్త ప్రహ్లాదుడుగారు కూడా అరవబట్టె! అదేమైనా అడ్డమైన తిట్టా... నోరు తీటబుట్టి.. దవడలు బిగదీసుకుపోతుంటే వాటిని సాగదీసి సవరించుకోడానికి పెడుతున్న పెడబొబ్బలా?" మల్లేశు వివరంగా వివరించాడు!

"అది తిట్టూకాదు - అడ్డదిడ్డమైన వంకరకూతా - కారుకూతా కానేకాదు. అసలది 'శుభమో నీకు రాజ ప్రతాపా' అని రాజుగారిని రంజుచేసి హుషారు చేసేది - అది బాగా అలవాటై నోళ్ళలో నానీ.. నానీ.. చివరికి అట్లా మారిపోయిందన్నమాట!" సర్సరె... అంతవరకూ బాగానే వుంది గానీ.. రాజుగార్ని సైనికుడుగారు గట్లా ఆ మాటంటే బాగుంటుంది. మరి మంత్రిని రాజూ.. తండ్రిని కొడుకూ - గా మాటతోనే హుషారు చేసుడేంది? చివరికి నరసింహస్వామి కూడా హిరణ్య కశిపుడ్ని పరపరా చీల్చినాక గదే మాటకు తగులుకునె - నువ్వెన్నయినా చెప్పవె అన్నా.. మన నాటకాలు పూరాగా చెడిపోయినై!" జక్కులోడు బహు ఆవేదన పడుతూ అన్నాడు.

"సర్సరే.. సమయం సందర్భం తెలవకా.. దానర్థం సరిగా బోధపడకా.. పాపం ఆ పేద కళాకారులు అట్లా ఆ పదాన్ని వాడుతున్నారంటే మనం సరి చెప్పుకోవచ్చు! జాలి పడవచ్చు! సరె.. అది చిక్కిపోతున్న మన నాటక రంగం.. మరిపుడు మన ఈ కేంద్రంలోని నాయకులు.. రాష్ట్రంలోని పెద్దమనుషులూ.. పదవులు.. అధికారం.. ప్రజాస్వామ్యం.. న్యాయస్థానం అన్నీ వుండి కూడా మాటి మటికీ ఆ మాటనే వినిపించడం వికారంకాదా.. వెగటు పుట్టించదా?"

నేను ఇట్లా వివరించే సరికి యాద్గిరి నోట్లో నుండి బీడీ అధాటున జారిపోయింది. మల్లేశు దబ్బున చప్టామీద కూలబడి పోయాడు. రావిచెట్టు మీద పిచుకల గుంపు కిచకిచమని రెక్కలు తాటించాయి.

వినండి మరి -

మన దేశంలో బి.జె.పి. పార్టీది ఒక విచిత్రమైన వ్యూహం! దాని కాషాయ దళాలు - మూక తమ బాణీని, వ్యవహారశైలినీ - తమతమ ప్రయోజనాల కనుగుణంగా ఎప్పటికపుడు మార్చి ప్రకటించుకోవడంలో వాటికవే సాటి!

అసలు యన్డీయె కిచిడీ కూటమి ప్రసవ సమయంలో ఈ వి.హెచ్.పి. - ఆరెస్సెస్ - భజరంగ్‌దళ్ వాజ్‌పేయిని ఇంద్రుడనీ.. కవి పుంగవుడనీ.. మేధావీ.. మిత మృదు భాషీ అనీ- 'శంభో హరహర' అని భుజకీర్తులు తగిలించుకుని నానా గత్తరగా భజనలు చేశారు. ఆయనగారేమో గుంభనగా ముఖానికో 'ముఖాటా' తగిలించుకుని 'వీళ్ళంతా అసలుసిసలు దేశభక్తులు సుమా!" అని శంభోరాజ పరివారమా అని కితాబులిచ్చేశాడు. రామ మందిరం - అయోధ్య వాళ్ళ హిందుత్వ ఆవేశకావేశ ఓటు బ్యాంకు కాబట్టి దాన్ని నినాదంగా పైకి (ఎన్నికలపుడు) వెలికితీసే సమయంలో ఈ రకరకాల కాషాయ గుంపులు ఎవరికి వారే గొంతులు చించుకుని 'శంభో రాజ ప్రదీపా' నినాదాన్ని బయటకు కక్కుతాయి.

'స్వదేశీ' జపాన్ని ఓట్లకోసం వాజ్‌పేయి పఠించినపుడు వీళ్ళంతా చంకలెగరేస్తారు. అంతలోనే అనివార్యంగా అమెరికాకు అడుగులకు మడుగులొత్తుతూ 'నీ బాంచను' బానిస గులాంగిరి ప్రకటించి అమెరికా సామ్రాజ్యవాదాన్ని లపలప కీర్తిస్తారు. దానికీ వాళ్ళే చంకలు చరుచుకుంటారు. ఈ లోపున ప్రజలు విరుచుకుపడి తిట్లకు తగులుకుంటే నిలదీస్తే కాషాయకూటమిలోని కొన్ని దళాలు 'స్వదేశీ - శంభో' అని తగులుకుని ప్రజల బుర్రలను కకావికలు చేసిపారేస్తారన్నమాట!

యాద్గిరి తెరిచిన నోరు మూయకుండా విభ్రాంతుడై వింటూ కూర్చున్నాడు.

"ఇక మన చెంద్రబాబుగారు ఏనాడో బిల్‌క్లింటన్‌కూ.. టోనీ బ్లెయిర్‌కు 'శంభో రాజ ప్రదీపా' చెప్పేశాడు. అక్కడ్నుండి అమలు చేయమన్న ఆజ్ఞలను ఆదరాబాదరాగా అమలుచేసి పారేయడంలో 'అగ్రగామి'గా నిలబడి పోతున్నాడు. మొన్న టోనీ బ్లెయిర్‌గారు రాగానే చాలా గట్టిగా 'శంభో రాజ ప్రదీపా' చెప్పేశాడు. వారూ అతి గుంభనంగా మన రాష్ట్రంలో ఎనభైవేల మందికి 'లబోదిబో ప్రమాదం' చెప్పి వాళ్ల ఉద్యోగాలు ఊడబీకే కార్యక్రమానికి శ్రీకారం చుట్టి పారేశారు".

మల్లేశు మటమటలాడుతూ మీసాలు పీక్కుంటూ నానా హైరానా పడిపోతున్నాడు. "మరి అక్కడి అమెరికా పత్రికలు 'తానేతందాన' తీరుగా మన ముఖ్య మంత్రిగారికి 'శంభో - ప్రదీపా' చెప్పి అట్టకిరీటాలూ.. ఆర్భాటపు భుజకీర్తులూ తగిలించి యధాతథంగా వుబ్బేయడం.. ఈయనగారు వెర్రి సంతోషంతో చిందులు తొక్కడం చూస్తూనే వున్నాం! అబ్బో.. ప్ర. బ్యాంకుగారి కన్సెల్టీల బృందం ఎపుడూ గోతికాడ నక్కల్లా కాచుక్కూర్చుని వారికి 'శంభో' చెప్పడం.. వీరూ వారిని బుజాలమీద ఎక్కించుకుని నానా కంగాళీ కథక్కలి చేయడం జరుగుతున్నవే!"

"అరె.. నీకు 'శుభం' కలుగ్గాక అనివాడూ - వాడికి 'శుభం' కలుగుగాక అని వీడూ మద్దెలలు చరుచుకుని మోగించుకుంటే మరి మన గతేంటీ?" జక్కులోడు శివతాండవం చేసినంత పని చేశాడు.

"ఇక్కడే ఓ గమ్మత్తుంది. జాతరలాగా జరిగే బందోబస్తు జన్మభూముల్లో మూకుమ్మడిగా నిరుపేద, దౌర్భాగ్య దామోదరులందరికీ టోకున చెంద్రబాబుగారు 'శంభో రాజ ప్రదీపా' పలికిస్తారన్నమాట! అబ్బో.. ఎన్నెన్ని పథకాలు.. పనులు.. బడ్జెటు కేటాయింపులు.. కరువు కంట్రాక్టు బియ్యం.. కలలూ.. కాకరకాయలూ.."

"ఎవడూ పట్టించుకోవడం లేదు. ఎవనికాడికి వాడ్నే నిలదీసి పడేస్తున్నారు!" యాద్గిరి మరో బీడీ వెలిగించాడు.

" ఈ ఇస్తినమ్మ వాయనం - పుచ్చుకుంటి వాయనం మధ్య ప్రజల 'ఛీత్కార సత్కారం' జరిగితేగానీ ఈ పొగడ్తలూ - పొగరూ తగ్గదురా! ఎవడికి వాడే ఎదుటివాడ్ని ఉబ్బేసి - తాను వుబ్బిపోయేటపుడే ఆ 'పొంగు' ను జనం చల్లార్చి 'శంభో ప్రజా ప్రదీపా' అనిపిస్తేనే అందరం శాంతి సౌఖ్యాలతో వుండగలం..."

జక్కులోడు ఆ మాటలు విని చిన్న సైజు ఈల లాంటిది వేసి తన హర్షామోదాన్ని ప్రకటించేశాడు! ★

'టెన్నిస్' తిన్నెలు విశాల్, పూనమ్

విశాల్



హసన్ షరీఫ్

అతని వయస్సు కేవలం 12 ఏళ్ళే. కానీ జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్‌లో ఆరవ ర్యాంకు కలిగిఉన్నాడు. అతనిపేరే విశాల్‌రెడ్డి.

12 ఏళ్ళ విశాల్ సహజంగా కొత్తవారితో కలవడానికి సిగ్గుపడతాడు. అయితే టెన్నిస్ టేబుల్ బ్యాట్ చేతపడ్తే అతని సిగ్గు అంతా మటుమాయమవుతుంది. విజయమనే ఏకైక లక్ష్యంతో ఆడి అనుకున్నది సాధించడం అతనికే చెల్లు. "అతను టేబుల్ టెన్నిస్ వద్ద నిలబడితే అందరినీ మర్చిపోతాడు. తానెవరో, ఎక్కడ ఆడుతున్నాడో కూడా గుర్తుపెట్టుకో లేనంతగా ఆటలో లీనమవుతాడు. ఒకవిధమైన పిచ్చి అతనిలో అవహిస్తుంది. దీంతో అతనిముందు ఎంతపెద్ద ప్రత్యర్థి ఉన్నా చిత్తు కావాల్సిందే" అని విశాల్ తండ్రి అన్నారు. హృతిక్ రోషన్ వీరాభిమాని అయిన విశాల్ ఒంటరిగా ఉన్నప్పుడు కూడా కనీసం డ్యాన్స్ చేయడానికి కూడా సిగ్గుపడ్డాడు.

విశాల్ ప్రతిభ కారణంగా టేబుల్ టెన్నిస్‌లో రాష్ట్రం జాతీయస్థాయిలో చెప్పుకోదగ్గ విజయాలు సాధిస్తోంది. రాష్ట్రానికి చెందిన ఒక క్రీడాకారుడు జాతీయ స్థాయిలో క్వార్టర్ ఫైనల్లో ప్రవేశించడం విశాల్ చలవవల్లే జరిగింది. అతను ఇటీవల సబ్ జూనియర్ విభాగంలో ఆడేందుకు అర్హత కూడా సాధించాడు. సెయింట్ పాల్స్ అకాడమిలో శిక్షణ పొందుతున్న విశాల్ ఈ క్రీడలో ఒక సంవత్సరం క్రితమే ప్రవేశించాడు. టేబుల్ టెన్నిస్ ఆడడమే అతని ఏకైక ధ్యేయం కాదు. ఈ క్రీడల్లో అతను ఎటువంటి లక్ష్యాన్ని కూడా నిర్ణయించుకోలేదు. సెయింట్ పాల్స్ అకాడమి పొరుగునే విశాల్ ఇల్లు ఉంది. విశాల్ స్కూల్ నుండి వచ్చిన తర్వాత స్నేహితులతో సమయాన్ని వృథా చేయకూడదని భావించిన అతని తండ్రి ఈ అకాడమీలో చేర్చాడు. ఒక నెలలోనే ఈ ఆటలోని అన్ని మెళకువలను ఆకళింపు చేసుకున్న విశాల్ ఒక జాతీయ టోర్నమెంట్‌లో నేరుగా పాల్గొనే అర్హత సాధించాడు. తొలి జాతీయ మేజర్ టోర్నమెంట్‌లోనే అతను కనబర్చిన తెగింపు, చురుకుదనం అకాడమీ నిర్వాహకులతో పాటు టేబుల్ టెన్నిస్ మేధావులను కూడా ఆశ్చర్యంలో ముంచెత్తింది. "విశాల్ తొలి టోర్నీలోనే జాతీయ మేజర్ పోటీల్లో పాల్గొనడంతో ఏవిధంగా రాణిస్తాడో అని భయపడ్డాను. అయితే అతను కనబర్చిన చురుకుదనం, ధైర్యం చాలా సంతోషాన్ని కలిగించింది. చాలామంది ప్రేక్షకుల ముందు ఆడేందుకు భయపడడం వల్ల ప్రాక్టీసులో రాణించినప్పటికీ టోర్నీల్లో వెనకబడ్డారు. ఇతరులతో మాట్లాడడానికి సిగ్గుపడే విశాల్ మాత్రం ఆట ఆడేసమయంలో ఎవరినీ పట్టించు కోకపోవడం అనుకూలించింది" అని కోచ్ నాగేందర్ రెడ్డి అన్నారు. అమాయకపు ముఖంతో ఇతరులతో మాట్లాడ దానికి భయపడే విశాల్ సాధించిన టైటిళ్ళ గురించి అడిగితే మాత్రం ఏకరువు పెడ్తాడు. గేమ్‌లో టైటిళ్ళు సాధించడం ఆట పరిణతికి నిదర్శనం అని అతను భావిస్తాడు.

విశాల్ ఖాళీ సమయాల్లో క్రికెట్, బ్యాడ్మింటన్ కూడా ఆడతాడు. తాను టేబుల్ టెన్నిస్ అకాడమీలో చేరకుంటే క్రికెట్‌వైపు మొగ్గు చూపేవాడినని అతను చెప్తాడు. అతను మాంసాహారాన్ని ఇష్టపడ్డాడు. "చికెన్ లేదా మటన్ లేకుండా లంచ్ చేయను. మమ్మీ శాఖాహారి కావడంతో నాకిష్టమైన మాంసాహారాన్ని వండడానికి అప్పుడప్పుడు అంగీకరించదు. అప్పుడు డాడీ బయటినుండి తెచ్చి నా కోరిక మన్నిస్తాడు. బయటినుండి తెచ్చే మాంసాహారాల్లో చైనీస్, మంచూరియన్‌ను చాలా ఇష్టంగా స్వీకరిస్తాను" అని విశాల్ పేర్కొన్నాడు. తన వయస్సులోని ఇతర పిల్లల్లాగే విశాల్ వద్ద కూడా చిన్నపిల్లల చేష్టలు చాలా ఉన్నాయి. అతను తన అన్నయ్యతో తరచూ పోట్లాడి ఓడిపోతూ ఉంటాడు.

పూనమ్

లాన్ టెన్నిస్‌లో పూనం విజృంభణ

క్రికెట్ పట్ల అమితాసక్తి కనబర్చే దేశ క్రీడాభిమానులు ఇప్పుడిప్పుడే లాన్ టెన్నిస్ పట్ల కూడా మోజు పడ్తున్నారు. లియాండర్ పేస్, మహేశ్ భూపతి అంతర్జాతీయ స్థాయిలో పలు విజయాలు సాధించడంతో చాలామంది భారతీయులు ఆ ఆటపై కూడా దృష్టి కేంద్రీకరిస్తున్నారు. పేస్-భూపతి జోడీ ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్‌లో టైటిళ్ళు సాధించడంతో చాలామంది యువతీయువకులు టెన్నిస్ నేర్చుకోవడానికి ఇష్టపడ్తున్నారు. ఆ కోవలోనే ఎస్.పూనమ్ రెడ్డి కూడా టెన్నిస్ నేర్చుకోవడమే తన జీవిత ధ్యేయం అంటోంది. బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న పూనమ్ చిన్ననాటినుండే టెన్నిస్ పట్ల ఆసక్తి కనబరుస్తోంది. ప్రస్తుతం ఆమె దేశంలో పదిలోపు ర్యాంకు కలిగి ఉంది. అండర్-16 విభాగంలో మూడోర్యాంకు గల పూనమ్ అండర్-18లో పదిలోపు ర్యాంకు కలిగిఉంది. పూనమ్ తండ్రి వ్యాపారవేత్త. ఆమె తనకిష్టమైన టెన్నిస్‌లో ప్రవేశించడానికి చాలా కష్టపడింది. సిన్నెట్ టెన్నిస్ అకాడమీలో ప్రవేశానికి తండ్రి తొలుత అనుమతి ఇవ్వకపోవడంతో పట్టుబట్టి మరీ అనుమతి సాధించింది. ప్రస్తుతం ఆమె తన కోచ్ రవి చందర్ వద్ద శిక్షణ పొందుతోంది. "పూనమ్ ఫిట్‌నెస్, గేమ్‌లో అంతగా బలం లేదు. కానీ ఆమె మానసిక స్థైర్యమే విజయాలు అందిస్తున్నాయి" అని కోచ్ అన్నారు. పూనమ్ ప్రతిరోజూ ఉదయం మూడు గంటలు, సాయంత్రం రెండు గంటల సమయాన్ని ప్రాక్టీసుకు కేటాయిస్తోంది.

ప్రస్తుతం ఐటిఎఫ్ జూనియర్ టెన్నిస్ టోర్నమెంట్‌పై దృష్టి నిలిపిన పూనమ్ అందులో గెలిచి తన ర్యాంకును మరింత మెరుగు పర్చుకోవాలనుకుంటోంది. ఆమెకు తల్లినుండి పూర్తి సహకారం లభిస్తోంది. "నా పర్యటనల్లో మమ్మీ తోడుగా వస్తోంది. ఆమె ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తూ కొత్త ఉత్సాహాన్ని ఇస్తోంది. నాకు మమ్మీ మానసిక స్థయిర్యం ఇస్తోంది" అని పూనమ్ చెప్పింది. టెన్నిస్ పట్ల పూనమ్ అంకిత భావం, ఆసక్తి గమనించిన వారెవరైనా త్వరలో ఆమె అగ్రస్థానానికి చేరుకుంటుందని ఘంటాపథంగా చెప్తారు. ఆమె మహిళా టెన్నిస్‌లో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందనడంలో సందేహం లేదు. ★

అంతరాలు



ఆంగ్ల మూలం: రాధ డిసౌజా

తెలుగు: వి.వి. జ్యోతి

ఇది మీకు హాస్యాస్పదంగా అనిపించవచ్చు.

కాని ఇది నిజం.

నేను ఒకానొకప్పుడు పోచమ్మను చూసి అసూయపడ్డాను.

పోచమ్మ అంటే ఎవరో తెలుసా?

ఆమె ఒక కూలి మనిషి. అక్షరజ్ఞానం కూడా లేని మనిషి. రేపటికి తిండి దొరుకుతుందో లేదో కూడా గ్యారంటీ లేని మనిషి.

మరి నేను..

నేను ఒక భూస్వామి మనవరాలిని. అదీ గౌరవనీయుడైన బ్రాహ్మణ భూస్వామి మనవరాలిని.

ఇది మీకు అసహజంగా అనిపించవచ్చు. కానీ నేను పోచమ్మని చూసి అసూయ పడటానికి కారణం ఆమె కొలిచే దేవత. పోచమ్మ కొలిచే దేవత ఒక సాధారణ రాతి బొమ్మ. ఆ దేవత విగ్రహంలో స్పష్టంగా కనిపించేది చేప ఆకారంలోని కళ్ళు మాత్రమే. ఆ విగ్రహం చూడగానే నేను కొలిచే దేవత రూపం నా మదిలో మెదులుతుంది.

నా దేవత చాలా అందమైనది. తెల్లటి నున్నటి చర్మం, సన్నని నడుం, వజ్రాలు, కెంపులు పొదిగిన ఆభరణాలతో అలంకృతమైన నా దేవత రూపం అత్యంత సున్నితంగా, ఠీవిగా మనల్ని అంత దూరాన నిలబడేలా చేస్తుంది.

పోచమ్మ దేవత ఉండే గుడి చిన్నది. మట్టితో కట్టినది. అది పోచమ్మ గుడిసెకంటే చిన్నగా వుంటుంది. కానీ నా దేవత కొలువుండే గుడి చాలా పెద్దది. గోపురం ఆకాశాన్నంటేంత ఎత్తులో వుంటుంది. గుడి స్తంభాలపై అతిసుందరంగా సున్నితంగా చెక్కిన విగ్రహాలున్నాయి. గోడలపై అత్యంత కళాత్మకంగా గీసిన చిత్రాలు వుంటాయి.

పోచమ్మ తనిష్టం వచ్చినప్పుడు గుడికి వెళుతుంది. నిర్ణీత సమయమంటూ వుండదు. అక్కడ పూజారులు వుండరు. అర్చన, అభిషేకం తదితరాలు వుండవు.

కాని నా దేవత గుడిలో చాలా లోపల గర్భగుడిలో కొలువుంటుంది. పూజారి గర్భగుడి మధ్యలో నిలబడి వుంటాడు. ఆయన అలా నిలబడటం వల్ల దేవి పూర్తిగా అగుపించదు. చాలా సార్లు దేవీ దర్శనం అసంతృప్తిగానే ముగుస్తుంది. హారతికి, దర్శనానికి నిర్ణీత సమయాలుంటాయి. ఆ సమయాలలో అక్కడ లేకుంటే దర్శన భాగ్యం వుండదు. మనోహర దృశ్యాలను చెక్కిన పెద్దపెద్ద చెక్క తలుపులు మూసేసుండి పోపొమ్మంటాయి.

మా ఇంటిలో దేవీ స్తోత్రాలు నేర్చుకోనందుకు పెద్దలు నన్ను నిందిస్తూ వుంటారు. కాని పెద్దపెద్ద సంస్కృత శ్లోకాలు గుర్తుంచుకోవడం కష్టంగా అనిపిస్తుంది. అదే పోచమ్మయితే చక్కగా తన దేవత ఎదురుగా మోకాళ్ళు వెనక్కు మడిచి కూర్చుని ఆమెతో ముచ్చట్లాడుతూ వుంటుంది.

పోచమ్మ తన దేవతను 'అమ్మా' అని పిలుస్తుంది. నేను నా దేవతను 'దేవీ' అని సంబోధించాలి.

'అమ్మా! నువ్వే చెప్పు నేనిప్పుడేం చెయ్యాలి. సావుకారు వడ్డీ వెంటనే కట్టేయమంటున్నాడు. నేనెక్కడనుంచి తేను? నా కొడుకు రాజన్న ఇంటికి ఏమన్నా దుడ్డు పంపివుంటే అలాగే చేసి వుందును. కాని వాడికి పని పోయింది. ఇంటికి తిరిగి వచ్చేస్తున్నాడు" ఇలా పోచమ్మ తన కష్టసుఖాలు తన దేవతతో కలబోసుకుంటుంది.

పంట కోసిన తర్వాత పోచమ్మ మొదట కోసిన వరి కంకులను తన దేవతకు సమర్పించుకుంటుంది. చిన్నబోయిన ముఖంతో చిన్నగా నడుచుకుంటూ దేవత ముందుకెళ్ళి 'అమ్మా! నేను నీకోసం ఏం తెచ్చానో చూడు. ఈసారి నువ్వు నాకు మంచి పంటనే ఇచ్చావు. కానీ డబ్బంతా సావుకారుకి కట్టటానికే సరిపోయింది. ఈసారి దీనితో సరిపుచ్చుకో. ఈసారి నీదయ వల్ల నా అప్పులన్నీ తీరిపోతే నీకో కోడినిస్తా. రాజన్నకు నీ దయ వల్ల మంచి ఉద్యోగం వస్తే నీకు మేకపోతునే బలిస్తా" అంది.

తర్వాత దేవతకేసి చూసి నవ్వి ఆమె ముఖాన్ని నిమిరి ప్రేమగా మెటికలు విరిచింది. ఆమె అంత అలవోకగా తన దేవతను తాకడం. ప్రేమగా మెటికలు విరవడం నాకెప్పుడూ ఆశ్చర్యం కలిగిస్తూ వుంటుంది.

మేము మా దేవికి ఎప్పుడూ అంత దగ్గరగా వెళ్ళలేదు. వెళ్ళకూడదు. పూజారికి కూడా కొన్ని కఠినమైన నిబంధనలుంటాయి. ఇంటిలోని పూజా మందిరంలో కూడా దేవతల చిత్రపటాలను, పూజా సామాగ్రిని శుభ్రం చేయడానికి ముందు మేము తల స్నానం చేసి తడిబట్టలతో మడిగట్టుకోవాలి. అలా చేయకపోతే ఆపూజా మందిరం అపవిత్రమైపోతుంది. దానికి పరిహారంగా ఆ గదిని, చిత్ర పటాలను గంగాజలం చిలకరించి శ్లోకాలను ఉచ్ఛరిస్తూ శుద్ధిచేయాలి.

ప్రతి నెలా ఆ మూడు రోజులూ నా నీడకూడా దేవి మీద పడకూడదు. అది చాలా పెద్ద తప్పు. పోచమ్మ ఆ రోజుల్లో ఏం చేస్తుందో అని ఆలోచిస్తూ వుంటాను అప్పుడప్పుడూ. ఒకరోజు సిగ్గువిడిచి ఆమెనడిగా. ఆ రోజుల్లోకూడా నువ్వు నీ దేవత దగ్గర కెళ్తావా"అని.

తన కొంగును నోటికి అడ్డం పెట్టుకుని సిగ్గుపడుతూ 'ఇలా మాట్లాడుతున్నారేంటమ్మగారూ! ఇవాళో' అంది. కాని నాక్కావల్సిన సమాధానం రాలేదు ఆమెనుంచి.

నేను తనకంటే పదివన్నెండేళ్ళు చిన్నదాన్నయినా నన్ను 'అమ్మగారూ' అనే పిలుస్తుంది. మరి నేను భూస్వామి మనవరాలినిగదా!

పోచమ్మ తన దేవతకు ఎప్పుడూ భయపడినట్లు కనిపించదు. ఆమె దేవతకు కోపం రాదనుకుంటా ఎప్పుడూ. ఆమెకు సంబంధించిన జానపదకథల్లో (ఆ కథలు కోతల తర్వాత ఊళ్ళో చెబుతుంటారు) కూడా ఆమె తనను కొలిచేవారిని చల్లగా చూస్తుందనే చెబుతారు.

కాని మా దేవతకు ఆగ్రహం వచ్చేది అప్పుడప్పుడూ. ఆమెకు కోపం వచ్చినప్పుడు ఆమె ఆయుధాలు ధరించి నర్తించేది. యుద్ధాలు చేసేది. భూభాగాలను ఆక్రమించేది. చాలా మంది రాక్షసులను, తను దుష్టులుగా భావించిన వారిని సంహరించేది.

నేను సెలవుల్లో మా వూరెళ్ళినప్పుడల్లా ఇలా మా ఇద్దరి దేవతల గురించి పోల్చుకోకుండా వుండలేకపోయేదాన్ని.

కాలం గడుస్తూ పోయింది. నేను నా డిగ్రీ పూర్తి చేశాను. మా వాళ్ళు నాకు తగిన సంబంధం చూశారు. ఇంజనీరుకిచ్చి నాపెళ్ళి చేశారు. మావారు రాష్ట్ర విద్యుత్ బోర్డులో పనిచేస్తారు. పోచమ్మ, ఆమె దేవత క్రమంగా నా దృష్టిపథం నుండి తొలిగిపోయారు.

నాలుగున్నరేళ్ళ తర్వాత...

నా ఇరవై ఐదో పుట్టిన రోజుకి కొద్దిరోజుల ముందు నా భర్త ఒక యాక్సిడెంట్‌లో మరణించారు. నా కలల ప్రపంచం కూలిపోయింది.

నా భర్త చనిపోయిన దశదిన కర్మనాడు జరిగిన తంతును తలుచుకుంటే ఇప్పటికీ నారక్తం గడ్డకట్టినట్లవుతుంది. నా చుట్టూచేరి ఆడవాళ్ళు గుండెలు బాదుకుంటూ, పెద్దగా శోకాలు తీసిన దృశ్యాన్ని ఇన్నేళ్ళ తర్వాత కూడా నేను మర్చిపోలేను. వాళ్ళు నా ముడిని విప్పదీసి జుట్టును విరబోశారు. నా చేతి గాజులు పడలగొట్టారు. నా కాలి మెట్టెలను తీసేశారు. ఇదంతా శోకాలు తీస్తూనే చేశారు.

మా అమ్మ తన తలను చేత్తో కొట్టుకుంటూ బోరున ఏడుస్తూ 'నేనేం పాపం చేశాను, ఓదేవీ! నా బిడ్డను అలంకరించాల్సిన ఈ చేతులతోనే దాని ముక్కు పుడకను తీసేశానే' అని గగ్గోలు పెట్టింది.

నాయనమ్మ అయితే పెద్దగా ఏడుస్తూ "నా మనవడికి బదులుగా నన్ను తీసుకువెళ్ళక పోయావా దేవుడా. నేను సంతోషంగా వచ్చేదాన్నే! నా బంగారు తల్లి కడుపు పండినపుడు నా కెంపుల గాజుల జత ఇద్దామనుకున్నానే. సీమంతం సంబరంగా చేద్దామని నేను చూస్తుంటే దాని చేతుల గాజులు నా చేత్తో పగలగొట్టిస్తున్నావే! దీనికోసమేనా నేను బతికుంది" అని దేవుడిని నిలేసింది.

ఒక పక్క ఈ తంతు ఇలా జరుగుతుండగానే ఇంకో పక్క మగవాళ్ళు సమాజం ఎంతగా ముందడుగు వేసిందో తీవ్రంగా చర్చిస్తున్నారు. పాత రోజుల్లో అయితే మంగలిని పిలిచి జుట్టు గొరిగించేవాళ్ళనీ, తెల్ల చీరలు

మాత్రమే కట్టించేవాళ్ళని, మారుతున్న కాలంతోపాటు సమాజం కూడా మారుతోందని కొందరు అభిప్రాయపడ్డారు. ఇప్పుడు జుట్టువుంచుకోనిస్తున్నారనీ, రంగు చీరెలు కట్టనిస్తున్నారని, ఇది అభివృద్ధికి సంకేతమని వారు వాదించారు.

బ్రాహ్మణ కుటుంబాలు పట్టణాలలో ఉద్యోగాలమీదే ఆధారపడి బతుకుతున్నాయని, ఆడవాళ్ళు తెల్ల చీరెలతో, గుండుతో ఉద్యోగాలు చెయ్యడం కష్టం కాబట్టి ఈ మార్పును అంగీకరిస్తున్నారు తప్ప, అభ్యుదయ దృక్పథంతోకాదని ఇంకొందరు వాదించారు.

ఈ వాదన చాలా మందికి ఆగ్రహం కలిగించింది. 'ఉద్యోగాల కోసం కాదు. ఈ రోజుల్లో ఆడపిల్లలు చదువుకుంటున్నారు. జ్ఞానం తెలిసినవారు నిగ్రహంతో మసులుకోవడం ఎలాగో వారికి తెలుసు. కాబట్టి భౌతిక నియంత్రణలు, అలంకరణపై ఆంక్షలు అవసరంలేదు' అని వారు వాదించారు.

"చూడండి. హిందూ సంస్కరణ బిల్లు తర్వాత ఏం జరిగిందీ... 50 సంవత్సరాల క్రితమే దాన్ని, ఈ బిల్లును అమలులోకి తీసుకు వచ్చారు. కాని ఆచరణలో ఎంత మంది బ్రాహ్మణ యువతులు తిరిగి పెళ్ళి చేసుకున్నారు. వాళ్ళు చేసుకోరు. ఎవరో కొంతమంది బ్రిటిష్ అధికారులు వాళ్ళ పాపపు ఆలోచనలను చట్టాలుగా చేసినంత మాత్రాన, వందల సంవత్సరాలుగా వస్తున్న ఆచారాలను, సంప్రదాయబద్ధంగా పెరిగిన మన ఆడపిల్లలు కాలదన్నుతారా?" అని ఇంకొంత మంది సంప్రదాయాలు, ఆచారాల మీద తమ ప్రగాఢ విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఈ వాద సంవాదాలు ఇలా జరుగుతుండగానే నా నుదుటి సింధూరాన్ని చెరిపేసి, మంగళసూత్రాలు తెంచేసే సమయం వచ్చింది. ఆడవాళ్ళంతా ఒక్కసారిగా పెద్దపెట్టున శోకాలు ప్రారంభించారు.

దీనితో మగవాళ్ళ నోళ్ళు మూతబడ్డాయి. ఈ తంతు ముగిశాక నేను మా అమ్మానాన్నల దగ్గరకు వెళ్ళిపోయాను. నన్నెప్పుడూ ఉద్యోగానికి పంపరని నాకు తెలుసు. ఎందుకంటే మా కుటుంబ సంపదకు నేనొక్కదాన్నే వారసురాలిని.

***

నేను యిలా మాట్లాడటం మీకు కోపాన్ని తెప్పించినా నాకేం ఫర్వాలేదు.

ఆడది భర్తను కోల్పోతే అన్ని ఆశలు, కోర్కెలకు, ఆనందాలకు నీళ్ళొదిలి విరాగిలా బతకాలని అనుకుంటారందరూ. కాని ఆచరణలో అందుకు విరుద్ధంగా జరుగుతుంది. క్రమంగా ఆమె తన బాధను మరిచిపోగలుగుతుంది. తిరిగి మామూలు మనిషవుతుంది. అంటే అన్ని రకాల కోరికలతో ఆమె జీవిస్తుంది.

అదే నావిషయంలోనూ జరిగింది. ఇది వరకు చీరెలు, నగల విషయంలో నాకంత పట్టింపు వుండేదికాదు. పెళ్ళయిన ఆడవాళ్ళు అలంకరించుకోవాలి కాబట్టి నేనూ అలంకరించుకునేదాన్ని.

ఇప్పుడు మాత్రం నాకు రంగురంగుల చీరెలు కట్టుకోవాలనిపిస్తోంది. ఆకర్షణీయంగా కనిపించాలనిపిస్తోంది. నేను ఈ కోరికలను అణచుకోలేకపోతున్నాను.

అందుకే నేను గోళ్ళరంగు కొనుక్కున్నాను. అయినా శాస్త్రాల్లో గోరింటాకును నిషేధించారు గాని గోళ్ళ రంగును కాదు కదా! అలాగే లిప్‌స్టిక్ కూడా కొన్నాను. అదేమీ తాంబూలం కాదు కదా విధవలు వాడకుండా వుండటానికి. ఎత్తు మడమల చెప్పులు వాడటం ప్రారంభించాను. నుదుటిపై విధవలు పూసుకునే విభూదిని పూసుకోవడం మానేశాను. నేను బొట్టు పెట్టుకోలేకపోతే ఇక దేన్నీ పెట్టుకోను. కనీసం అలా అయినా ఆధునికంగా కనిపిస్తాను. ఇప్పుడు నన్నెవరూ విధవ అని అనుకోరు.



ఇదంతా మా ఇంట్లో వాళ్ళకు కాస్త ఇబ్బందికరంగా అనిపిస్తున్నట్లుంది.

"ఇది దేనికి దారి తీస్తుందో నాకేమీ అర్థంకావడం లేదు" అని మా అమ్మ నా వెనకాల గొణుగుతుంది.

మా బంధుజనమంతా కాలక్షేపానికి బాగా పనికొచ్చే 'రసవత్తరమైన సంఘటన" కోసం ఎదురు చూస్తున్నారు. అదీ గౌరవనీయమైన బ్రాహ్మణ కుటుంబంలో జరగాలని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

చివరికి మా నాన్న రంగంలోకి దిగాడు. సినిమాలు, టి.వి. నా ప్రవర్తనని మార్చాయని నిందించాడు. నన్ను మా ఊరికి పంపాలని నిర్ణయానికొచ్చాడు. తెలివైన పనని అందరూ మెచ్చుకున్నారు.

మా నాయనమ్మ, తాత దగ్గరకు నన్ను పంపారు. అప్పటికి మా ఊరు వెళ్ళి దాదాపు ఐదేళ్ళు.

***

ఈసారి పోచమ్మ చాలా విషాదంగా కనిపించింది. ఆమె ఇరవైనాలుగేళ్ళ కొడుకు రాజన్నను పోలీసులు ఎన్‌కౌంటర్‌లో చంపేశారు. అతను నక్సలైట్లకి సమాచారం అందిస్తున్నాడని పోలీసులు అనుమానించారు. ఆ అనుమానానికి ఆధారం ఏమిటని ఎవరూ అడగలేదు. ఆ ధైర్యం ఎవరికుంది?

పోచమ్మ ఏడుస్తూ తన దేవత దగ్గరకెళ్ళి "ఎందుకిలా చేశావు? నిన్ను 'అమ్మా' అని పిలిచానే? నువ్వు రాయివయ్యావా? చెవిటిదాని వయ్యావా? నీకు మనసే లేకపోయిందా? దాన్ని విసిరేశావా?" అని గుండెలు బాదుకుంది.

"నా కడుపు పండినపుడు నీకు బియ్యం, పప్పులు, కొబ్బరి కాయలు అన్నీ ఇచ్చానే. నా బిడ్డపుట్టినప్పుడు కోడిని కోశానే. అందుకా నువ్వు నాకిలా చేసింది" అంటూ నేలమీద దుమ్మును రెండు గుప్పిళ్ళనిండా పట్టుకొని తన దేవత ముఖం మీదికి విసిరింది.

తన తలను దేవత విగ్రహానికేసి కొట్టుకుంటూ పెద్ద పెట్టున ఏడుస్తోంది. తలమీద గాయం అయి రక్తం కారింది. విగ్రహం మీద పడింది. ఆ తర్వాత విగ్రహాన్ని పట్టుకుని చిన్న పిల్లలా ఏడుస్తూ వుండిపోయింది. నేను ఆమె వైపు అలాగే నిర్ఘాంతపోయి చూస్తుండిపోయాను.

నేను నా దేవిపై ఇలాగే దుమ్మెత్తిపోయాలనుకున్నాను. నా కెందుకిలా చేశావని నా దేవినే అడగాలని అనుకున్నాను. కాని నా దేవిని అడగాలంటే "నా తప్పేంటి నేనేం చేశానని నాకిలా చేశావు" అని అడగాలి.

ఆమె యిచ్చే సమాధానం కూడా నాకు తెలుసు. నాదేవి నర్మగర్భంగా నవ్వుతుంటుంది. నేను చేసిన పాపాల వల్లే నాకిలా జరిగిందంటారు. నేను చేసిన పాపం ఏమిటని నేను అడగలేను.

దానికీ సమాధానం వుంది. ఆ పాపాలు గత జన్మలో చేసినవి. లేకుంటే అంతకుముందు జన్మలోవి. నా 'కర్మ'నే నిందించాలి.

వీటన్నింటికంటే నాకు కోపాన్ని తెప్పించిందేమిటంటే నాదేవి పక్కన ఎప్పుడూ ఒక దేవుడు వుండాల్సిందే. ఆవిడ ఎప్పుడూ ఒంటరిగా లేదు.

పోచమ్మ దేవత అందరికీ 'అమ్మ' మాత్రమే. ఆమె ఎప్పుడూ ఒక్కతే, ఠీవిగా వుంటుంది. ఆమె గురించి ప్రచారంలో వున్న కథల్లో కూడా ఆమె భర్త గురించిన పట్టింపులేదు.

***

నేను పోచమ్మ దేవత దగ్గరికి తరచుగా వెళ్ళేదాన్ని. బయటినుంచి చూడటానికే కాదు. ఒక రోజు గుండె చిక్కబట్టుకుని ఆమెని కొలిచే జనంలాగానే నేనూ లోపలికి వెళ్ళాను. మొదట అదో రకంగా అనిపించింది. ఇక్కడ ఏ విధమైన నిబంధనలూ, నిషేధాలూ లేవు. మరీ ముఖ్యంగా అర్థంకాని భాషలో శ్లోకాలు చదువుతూ బెదిరించే పూజారులు లేరు. మొత్తంమీద నాకు ఆ గుడి వాతావరణం క్రమంగా అలవాటయింది. ఇష్టంగా అనిపించింది.

ఇంట్లో గొణుగుళ్ళు మొదలయ్యాయి. "మన గుడికెందుకెళ్ళవు? వెళ్ళి 'దేవి'కి నిన్ను నువ్వు అర్పించుకో. అప్పుడు ఏ బాధా వుండదు. మనస్సు ప్రశాంతంగా వుంటుంది" అని మా నానమ్మ చెబుతుండేది.

ఇప్పుడు ఇహ మా గుడి నాకు అస్సలు నచ్చడం లేదు. నన్ను లోపలికి రానివ్వరు. పూజారులు పువ్వులు, కొబ్బరి చిప్పలు ఇవ్వరు. నన్ను ఆశీర్వదిస్తూ నా నెత్తి మీద శఠగోపం పెట్టరు. ప్రధాన మండపం వద్దే నుంచుని 'పూజ'ను దూరం నుంచే చూస్తుండాలి. నన్ను వెలేసినట్టు అనిపించేది.

ఒక రోజు పోచమ్మ నడిగాను. "మీ దేవత మీ మొర ఆలకించినట్లే నా గోడు కూడా వింటుందా?" అని.

ఒక్కసారిగా ఆమె ముఖం బాధతో నిండిపోయింది. వెంటనే తన దేవతను తల్చుకుని 'అమ్మా! అమ్మగారికెందుకిలా అయింది. ఆమె చాలా మంచిది" అంటూ తన నుదిటిని చేత్తో కొట్టుకుంటూ అడిగింది.

అయితే నేనొకటి గమనించా. ఆమె నా ప్రశ్నకు సమాధానం ఇవ్వలేదు. నాకు జరిగిన దానికి తన దేవతను నిందించలేదు. నిజమే కదా! మేము ఆమె దేవతను కొలవము కదా! మరి నా కర్మకు ఆమె దేవత ఎలా బాధ్యురాలు?

నేను క్రమంగా పోచమ్మ దేవతతో మాట్లాడటం మొదలుపెట్టాను. అయితే పోచమ్మలాగా నోరారా పెద్దగా అరుస్తూ నా ఆవేదనని వెళ్ళగక్కలేకపోయాను.

ఒకరోజు దేవతకు బాగా దగ్గరగా వెళ్ళాను. నా చేతుల్ని ఆ విగ్రహం ముఖం మీద వుంచాను. బహుశా పోచమ్మలాగ విగ్రహాన్ని నిమరాలని అలా చేశానేమో! నాకే తెలియకుండా దేవతతో బిగ్గరగా మాట్లాడటం ప్రారంభించాను. "అమ్మా! నన్నూ నీ బిడ్డే అనుకో. నా ఒక్క కోరిక తీర్చు. అది తప్పితే ఇంకేమీ అడగను. నువ్వేదడిగినా ఇస్తా...."

అక్కడితో హఠాత్తుగా నా నోటి నుండి మాటలు రావడం ఆగిపోయాయి. గొంతుకేదో అడ్డు పడ్డట్లయింది. నేనా దేవతకు ఏమివ్వగలను? నా నగా నట్రా అంతా అమ్మానాన్నల అధీనంలోనే వుంటుంది. నాకు ఆదాయం వచ్చే మార్గమే లేదు. ఏ అవసరానికైనా తాత, నానమ్మలను అడగాల్సిందే. అంతేకాదు. కనీసం కోడిని తీసుకెళ్ళి ఇద్దామన్నా దానిని మేము తినం, బలిచ్చే అలవాటూ లేదు.

ఇవన్నీ మదిలో మెదలగానే నిరాశగా అనిపించింది. ఏడుపొచ్చింది. ఏడుస్తూ "అమ్మా! నీకేమీ ఇవ్వలేకపోతున్నా. అయినా నన్ను నీ బిడ్డగానే చూడు. నన్నీ స్థితినుండి బయట పడెయ్యి.."

తర్వాత మాటలు తడబడ్డాయి "నాకొక భర్త నివ్వు"

ఆ మాటలు ఉచ్ఛరించగానే ఒక్కసారిగా నా శరీరమంతా విద్యుత్ ప్రవహించినట్లయింది. అసలు ఇలాంటి ఆలోచనలు నాకెందుకు రావాలి? వచ్చినా వాటిని నేనెందుకు బయట పెట్టాలి. నా నోటితో నేనెందుకు ఇలాంటి పదాలను ఉచ్ఛరించాలి? పోచమ్మ దేవత నన్నావహించలేదు కదా! ఆవిడ నిజంగానే నన్ను తన బిడ్డగానే భావించిందా? ఇలాంటి ఆలోచనలు ఆమె జనానికి రావచ్చుగాని నేను బ్రాహ్మణురాలిని గదా!

గుడి నుండి పరుగు పరుగున ఇంటికి చేరాను. ఆ సాయంత్రానికి నాకు జ్వరం తీవ్రంగా వచ్చింది. మూర్ఛలాగా వచ్చి పిచ్చిపిచ్చిగా కలవరించాను.

కలవరింతలు విన్న మా నానమ్మ ఆనందంగా

"ఇక సమస్య ఉండదు. చిన్న వయస్సులో ఉన్నప్పుడు ఇలాగే వస్తాయి. ఇలా ఇంకొన్ని సార్లు వస్తే అది మామూలు మనిషయిపోతుంది" అంది.

తన చేత్తో నుదిటి పై గట్టిగా కొట్టుకుంటూ "ఆడజన్మే పాపపు జన్మ. ఈ జన్మ పగవాళ్ళకి కూడా వద్దు. కోరికలు ఆడదాన్ని అంత తొందరగా వదిలిపెట్టవు" అని నిట్టూర్చింది.

నాకు చాలా శ్రద్ధగా ప్రేమతో సేవలు చేసింది. నేను కోలుకున్నాక కోరికల నధిగమించడానికి చాలా చిట్కాలు చెప్పింది.

చన్నీళ్ళతో స్నానం, మసాలాలు, పచ్చళ్ళు తినకపోవడం, అద్దంలో చూసుకోకపోవడం, దేవీ స్తోత్రాలు పఠించటం వాటిలో కొన్ని.

***

రెండు నెలల తర్వాత అసంకల్పితంగానే నేను పోచమ్మ దేవతని చూడటానికి వెళ్ళాను. అయితే అక్కడ వాతావరణం పూర్తిగా కొత్తగా వుంది. గుడి పక్కనున్న మర్రి చెట్టుకింద గుంపుగా జనం కూర్చుని వున్నారు. అక్కడ ఒక యువకుడు నిలబడి ప్రసంగిస్తున్నాడు. అతన్ని చూస్తుంటే ఏదో విషయం గురించి తీవ్రంగా వాదిస్తున్నట్లుంది. కూర్చున్న జనం చాలా శ్రద్ధగా ఆలకిస్తున్నారు. అతడిని అంతకు ముందు నేనెప్పుడూ చూడలేదు. గుడిలోకి వెళ్ళకుండానే నేను వెనక్కి తిరిగాను.

తర్వాత నేనెప్పుడెళ్ళినా ఆ యువకుడు అక్కడ కనిపించేవాడు. నెమ్మదిగా నాతో మాట్లాడటం ప్రారంభించాడు. "మీకు ఈ గుడి నచ్చిందా?" అని అడిగాడు. "చాలా బాగుంది. అందుకే వస్తున్నాను" అని చెప్పాను.

అతను బాగా చదువుకున్న వాడిలాగా కనిపిస్తున్నాడు. నగరం నుండి వచ్చినట్లున్నాడు. క్రమంగా నాతో చనువుగా మాట్లాడటం ప్రారంభించాడు. అతను గొప్ప మాటకారి. చాలా విషయాల గురించి అనర్గళంగా మాట్లాడుతుండేవాడు.

అతను యూనివర్శిటీలో లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. మానవశాస్త్రం బోధిస్తాడు. ఈ ఊళ్ళో అతనికి దగ్గర బంధువులు వున్నారు. వేసవి సెలవల్ని వారితో గడపడానికొచ్చాడు. అతను తన మూలాల్ని మర్చిపోకుండా వుండటానికే పల్లెల్లో బంధువుల దగ్గర గడుపుతానని చెప్పాడు. భారతదేశంలో కుల సమస్య, భూమి సమస్యలపై యూనివర్శిటీల్లో చర్చ జరుగుతోందని చెప్పాడు. కుల సమస్య పరిష్కారం వ్యవసాయక విప్లవానికి దారి తీస్తుందా లేక వ్యవసాయక విప్లవమే కుల సమస్యను పరిష్కరిస్తుందా అనే విషయంపై వాదోపవాదాలు జరుగుతున్నాయని చెప్పాడు. స్త్రీల సమస్యలపై జరిగే చర్చలను వివరించాడు. ఇంకా యిలాంటివే చాలా మాట్లాడుతుండేవాడు.

ఇక్కడ మా వాళ్ళలో అతని గురించి పెద్ద చర్చ జరుగుతోంది. అతను అజ్ఞాని అనీ, ప్రభుత్వం యిలాంటి మూర్ఖులని తేరగా మేపుతుండటం వల్ల ఏదో యూనివర్శిటీ డిగ్రీలు సంపాదించగలిగాడని వ్యాఖ్యానించారు. "ఇలాంటి వారికి జ్ఞానం ఎక్కడి ఉండి వస్తుంది? గాడిదను సరస్వతీ దేవి ఆలయం దగ్గరకు లాక్కువచ్చినంత మాత్రాన దానికి పాడటం వస్తుందా?" అని వారు ప్రశ్నించారు.

కాని పోచమ్మవాళ్ళ కులంలోని ఆడవాళ్ళందరూ తమ బిడ్డలకు అతనిలాగ చదువుకోవాలని, పైకెదగాలని చెప్పేవాళ్ళు. యువకులంతా అతన్ని ఆరాధించేవాళ్ళు. పెద్దవాళ్ళు కూడా అతను చెప్పేది శ్రద్ధగా ఆలకించేవారు.

అతను తన వాళ్ళతో మాట్లాడుతుంటే నేను అతన్నే గమనించేదాన్ని. అతని ముఖంలో కనిపించే నిజాయితీ, చురుకుదనం చూస్తుంటే నాకెంతో అపురూపంగా వుండేది.

***

సెలవులు అయిపోవచ్చాయి. అతను యూనివర్శిటీకి తిరిగి వెళ్ళాల్సిన సమయం దగ్గరకొచ్చింది. వెళ్ళేముందు "నాతో వస్తావా" అని అడిగాడు.

మేమిద్దరం బస్సెక్కాం. సిటీకి చేరగానే నేరుగా పోలీసు స్టేషన్‌కు వెళ్ళాం. నా ఇష్టంతోనే అతనితో నేను వచ్చానని, నేను మేజర్నని వారికి రాసిచ్చి దానికి ఆధారంగా నా వయస్సును నిర్ధారించే 'డేట్ ఆఫ్ బర్త్' సర్టిఫికెట్ నకలు కాపీని వారికిచ్చాం. తర్వాత రిజిస్ట్రార్ ఆఫీసుకు వెళ్ళి పెళ్ళి పత్రాలు నింపి వచ్చాం.

అతని స్నేహితులు కొందరు మమ్మల్ని చూడటానికి ఊరినుంచి వచ్చారు. నా స్నేహితులు కూడా కొందరు రహస్యంగా నన్ను కలిశారు. వాళ్ళు చెప్పిన వివరాల్ని బట్టి...

మానాన్న మా నాయనమ్మ మీద చాలా కోపగించుకున్నాడట నామీద ఓ కన్నేసి వుంచలేదని. పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి నన్ను కిడ్నాప్ చేసినట్లు, నాపై అత్యాచారం చేసినట్లు ఫిర్యాదు చేసి వచ్చారట. మామూలుగా అయితే ఫిర్యాదును తీసుకున్న వెంటనే పోలీసులు 'ముద్దాయిని' లోపలేసి మర్యాద చేసేవారే. కాని నా భర్త వెనుకబడిన కులాల్లో బాగా పేరున్న మేధావనీ, అతని జోలికి వెళితే తీవ్ర నిరసనను ఎదుర్కోవలసి వస్తుందని, కాబట్టి తామేమీ చేయలేమని, చట్టం కూడా అతని వైపే వుందని పోలీసులు మానాన్నకు తేల్చి చెప్పేశారు.

దానితో ఆయన కోపం మా అమ్మ వైపుకు మళ్ళింది. "చూడు నీ కూతురు నా మొహంమీద ఉమ్మేసి పోయింది. అది చేసిన పనికి నేను ఊళ్ళోవాళ్ళ ముందు తలెత్తుకోలేకపోతున్నాను" అని అమ్మ మీద ఎగిరాడు.

పాపం ఆమె ఏమి చేయగలదు ఏడవడం తప్ప.

ఇదివరకైతే మానాన్న నా శ్రాద్ధ కర్మలు నిర్వహించాల్సొచ్చేది. నేను తనకు చచ్చిందానితో సమానమని లోకానికి తెలపడానికి. రోజులు మారాయి. ఇప్పుడు నాకు తనకు సంబంధంలేదని ప్రకటించి, నాతో రాకపోకలు నిషేధిస్తే చాలు బంధుజనం సంతృప్తి పడటానికి.

ఎవరైనా తనను పరామర్శించటానికొస్తే చాలు మానాన్న 'అలగా జనం'పై దుమ్మెత్తి పోసేవాడు.

"వీళ్ళకి సూదిమొనంత చోటిస్తే ఊరంతా కావాలంటారు. మొదట వీళ్ళు మన గుళ్ళలోకి వస్తామన్నారు. ఏదో రోజులు మారుతున్నాయి కదాని సరేనన్నాం. తర్వాత మన బావుల్లోంచి నీళ్ళడిగారు. ఇవ్వకపోతే బ్రిటిష్ వాళ్ళతో కలుస్తామని ఈ వెధవలు మనల్ని బెదిరించారు. దానితో ఒప్పుకోవాల్సొచ్చింది. తర్వాత స్కూళ్ళలోకి, యూనివర్శిటీల్లోకి ప్రవేశించారు. మన బిడ్డల చేతుల్లోంచి ఉద్యోగాలు లాక్కున్నారు రిజర్వేషన్ల పేరుతో. ఇప్పుడు మన కూతుళ్ళనే అడుగుతున్నారు. ఇది సమాజాన్ని అరాచకం పాల్జేస్తుంది" అని ఎగిరిపడేవాడు.

తర్వాత మానాన్న మండల్ కమిషన్‌కి, రిజర్వేషన్ విధానానికి వ్యతిరేకంగా తీవ్రంగా ప్రచారం చేశాడు. ఆ విధంగా పోయిన ప్రతిష్టను కొంత తిరిగి పొందగలిగాడు.

మా పెళ్ళి మా ఊళ్ళో చాలా గొడవలు రేపింది. మేము బస్సెక్కేమో లేదో, ఆవార్త దావానలంలా ఊరంతా వ్యాపించింది. మా వాళ్ళు గుంపులు గుంపులుగా ఊరంతా వెతకడం ప్రారంభించారు. మా వాళ్ళు ఉగ్రులైపోయారు. మరుసటి రోజు మా వాళ్ళు పోచమ్మవాళ్ళ గుడిసెలు తగులబెట్టారు. పెద్ద కర్రలు, పలుగులతో పోచమ్మ వాళ్ళ దేవత గుడిని ధ్వంసం చేశారు.

ఆ మరుసటిరోజు పోచమ్మ వాళ్ళ ఇళ్ళలోని కుర్రాళ్ళు మావాళ్ళమీద యాసిడ్ బల్బులు విసిరారు. ఒక వ్యక్తి ముఖం పూర్తిగా కాలిపోయింది. వాళ్ళు మా వూరి సావుకారు ఇంట్లోకి దూరి అప్పు ఇచ్చినట్లున్న రికార్డులనన్నింటినీ తగులబెట్టారు. మాది నక్సలైట్ల ప్రభావం వున్న ప్రాంతం. అందుకని ఇరుప్రక్కల వారు తుపాకులు వాడారు. పారా మిలిటరీ దళాలు వచ్చేయి. మా వూళ్ళో క్యాంపును ఏర్పాటు చేశారు. పోచమ్మవాళ్ళ కుర్రాళ్ళను చాలా మందిని క్యాంపువాళ్ళు అరెస్టు చేశారు.

సిటీలో దిన పత్రికలు కూడా రెండు పక్షాలుగా చీలిపోయాయి. ఒక పత్రిక ఒకరిని సమర్థిస్తూ రాస్తే, ఇంకో పత్రిక దాన్ని ఖండిస్తోంది.

ఒక పక్షంవాళ్ళు ఇలా వాదిస్తున్నారు. "మన దేశంలో ఐక్యత లేకుండా వుండటానికి కారణం ఇంత మంది దేవతలుండటమే. భారతదేశం శక్తివంతమైన దేశంగా ఎదగాలంటే మనందరికీ ఒకే దేవత వుండాలి. పశ్చిమ దేశాలవారు ఇంత అభివృద్ధి చెందారంటే దానికి కారణం ఇదే. కొన్ని శతాబ్దాల ముందే వాళ్ళు చర్చిని, రాజ్యాన్ని, అధికారాన్ని ఒకే పరిధిలో వుంచారు. దానివల్లే వారు తర్వాత ఈ స్థితికి చేరగలిగారు. మనం కూడా అలాగే చెయ్యాలి. అవసరమైతే రాజ్యాంగాన్ని కూడా మార్చటానికి మనం ప్రయత్నించాలి.

మా వర్గంలోని కుర్రాళ్ళంతా ఒక సంస్థను ఏర్పాటు చేసి గుడి పడగొట్టిన ప్రదేశంలో దేవి ఆలయాన్ని నిర్మించ తలపెట్టారు. అంతే ఎన్నో ఏళ్ళుగా పోచమ్మ దేవత గుడి వున్న ప్రదేశంలో ఇప్పుడు దేవి ఆలయాన్ని నిర్మించాలని దేశవ్యాప్తంగా చర్చ ప్రారంభమైంది.

రెండో పక్షంవాళ్ళు దీన్ని తిప్పికొట్టారు. "దేశంలోని అరవైశాతం జనాభాను కనీసం మనుషులుగా గుర్తించకుండా వుంటే దేశం ఎలా శక్తివంతంగా తయారవుతుంది. పాశ్చాత్య దేశాల అభివృద్ధికి కారణం వారికి ఒక్కడే దేవుడుండటం కారణంకాదు. వారి అంతర్గత సామర్థ్యం దానికి కారణం. అంతేకాదు వారిని చీలికలు పేలికలుగా విడగొట్టడానికి అక్కడ కులం లేదు. వర్గాలు కూడా లేనివి కావు. ఒక వర్గం నుండి పై వర్గానికి చేరడం కూడా మనంత కష్టం కాదు. దేవీ ఆలయం నిర్మాణం కోసం జరుగుతున్న ప్రచారాన్ని తిప్పి కొట్టండి. అగ్రవర్ణాల వారు మన ఉనికి నిర్మూలించ జూస్తున్నారు. వాళ్ళెప్పుటూ ఆపని చేస్తూ వస్తున్నారు. ఇప్పుడు మన గుడిని పడగొట్టారు. మొదట మనల్ని దూరంగా నెట్టి మనకు ఉనికి లేకుండా చేశారు. ఇప్పుడు మనల్ని కూడా దేవినే పూజించమని చెప్పి మన దేవతలను కూల్చి మనకు ఉనికి లేకుండా చేస్తున్నారు. రాజ్యాంగాన్ని వాళ్ళిష్టప్రకారం మార్చాలనుకోవడానికి అదేమీ వాళ్ళ బాబు సొమ్ము కాదు."

రెండో పక్షం వాళ్ళు కూడా ఒక సంఘంగా ఏర్పడి దేవీ ఆలయ నిర్మాణ ప్రచారాన్ని తీవ్రంగా ఎదుర్కొన్నారు. అదే స్థలంలో మళ్ళీ వాళ్ళ దేవత గుడినే నిర్మించాలని తల పెట్టారు. దానికనుగుణంగా జాతీయ స్థాయి చర్చ ప్రారంభించారు. దేశ వ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించి దేవీ ఆలయ నిర్మాణాన్ని అడ్డుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. దాని కోసం అవసరమైతే ప్రాణాలయినా యిస్తామని ఉద్వేగంగా ప్రకటించారు. ఇలా రెండు వైపులా బహిరంగ సభలు జరుగుతున్నాయి.

ఈలోపు నాభర్తను 'జంగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైకాలజీ' సంస్థవాళ్ళు 'పురాతన సమాజాలలో మాతృదేవతలు' అనే అంశంపై పరిశోధన చేయమని పిలిచారు. దానితో మేము సిటీని వదిలి వెళ్ళిపోయాం.

అయితే ఒక విషయం నన్నెప్పుడూ బాధిస్తుంటుంది. పోచమ్మ గుర్తొచ్చినప్పుడల్లా ఆమె జీవితంలో ఆమె దేవత ఎంత విలువైనదో గుర్తొస్తుంది. ఆ దేవత విగ్రహం విధ్వంసానికి నేనే కారణమయ్యానని అనిపిస్తుంది. గుండె కలుక్కుమంటుంది. ★

గాయపడిన చిన్నారుల హృదయఘోష

ఈ పుస్తకం ఇటలీ దేశానికి సంబంధించినది. ఇందులో చర్చించిన సమస్య పాఠశాల విద్యా విధానం గురించి. రచయిత ఒక్కరు కాదు, ఎనిమిది మంది బార్బియానా విద్యార్థులు. ఇది ప్రధానంగా విద్యా వ్యవస్థలోని లోపాలు, టీచర్ల వైఖరిపై ఎక్కుపెట్టిన బాణం. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను కాకుండా టీచర్లు ఆశించింది ఏదో తమలో లేదని నిరాదరణగా చూడటాన్ని వారు ప్రశ్నిస్తారు. అయితే ఇది కేవలం వాదన కాదు. ఆచరణలో నిరూపితమైన వాస్తవం. సరిగ్గా చదవడంలేదనే కారణంతో బడినుండి తప్పించబడిన పిల్లలు ఓ ఫాదర్ సాయంతో రాసిందే ఈ పుస్తకం. పుస్తకంలో 'నేను' 'మీరు' అంటే టీచర్లు అని అర్థం పేరు కాదు, ఒక పట్టణమూ కాదు. కొండల్లో నివసించే 20 రైతు కుటుంబాల బడి' అనే పద్ధతి ఒకటి వుంది. అయితే అదే తరగతిలో వుంచేవారు. పైపెచ్చు మంది టీచర్లు అవహేళనగా విద్యార్థులు ఆ తరువాత తామే పాఠశాల అవహేళనకు గురైన అనేక మంది తమ కనపరిచారని విద్యార్థులు రుజువు కాదు కానీ, మేం ఒక్క తరగతిలో తప్పితే ఎంతో మందిని తప్పించే మీకు మేం మాకెప్పుడూ గుర్తుంటారు' అని కూడా కూడా టీచర్లు వివక్ష పాటిస్తారని వెళ్ళి చదువుకుంటారు. పేదవాళ్ళకు వారినే మళ్ళీ మళ్ళీ తప్పించడం ఎంత 1986లోనే 'పంతులమ్మకు లేఖ' పేరుతో

టీచర్లకు ఉత్తరం
తెలుగు : కె.సురేష్,
వెల : రూ. 35/-;
ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు;

అంటే మొత్తం ఎనిమిది మంది విద్యార్థులు, చేసుకోవాలి. అసలు బార్బియానా ఒక బడి టుస్కానీలో ముగెల్లో అనే ప్రాంతంలో గల సమూహం. ఇటలీ విద్యా వ్యవస్థలో 'తప్పనిసరి అక్కడ బాగా చదవని విద్యార్థులను తప్పించి విద్యార్థుల హృదయం గాయపడేట్లు అనేక మాట్లాడేవారు. ఇది సహించలేని కొందరు నిర్వహణను చేపడ్తారు. టీచర్ల చేతిలో ఆధ్వర్యంలో చక్కగా చదివి ప్రతిభ చేస్తారు. 'టీచర్ కోర్సుల్లో మీరు తప్పినా ఏం తప్పా' అని విద్యార్థులు సూటిగానే ప్రశ్నిస్తారు. గుర్తున్నామో లేదో కానీ మీ టీచర్లు అంటారు. విద్యార్థులను తప్పించే విషయంలో చెబుతారు. ధనవంతుల పిల్లలు ట్యూషన్లకు అలాంటి సౌకర్యం ఏదీ వుండదు కనుక వరకు సబబని అడుగుతారు.

ఈ పుస్తకాన్ని నండూరి ప్రసాదరావు అనువదించారు. అయితే వాటి ప్రతులు అయిపోవడంతో ఇప్పుడు మరలా కె. సురేష్‌తో అనువాదం చేయించారు. అనువాదకుడు చెప్పుకున్నట్లుగానే కొన్ని చోట్ల భాష కృతకంగా అనిపిస్తుంది. అయితే సబ్‌హెడ్డింగ్స్ పెట్టే విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే బాగుండేది. సబ్ హెడ్డింగ్స్ వున్న చోట పారాగ్రాఫులను విడదీయక పోవడం వలన కొన్ని చోట్ల అర్థంలో మార్పు వచ్చింది. ఏమైనా ఈ పుస్తకాన్ని ముఖ్యంగా తల్లిదండ్రులు చదవాలి. తమ పిల్లలు పాఠశాలల్లో ఎలాంటి విద్య నేర్చుకుంటున్నారో వారు అర్థం చేసుకోవాలి. అలాగే ఉపాధ్యాయులు తాము విద్యా బోధనలో శాస్త్రీయ పద్ధతులు పాటిస్తున్నామో లేదో కూడా విశ్లేషించుకోవాలి. దేశం వేరైనా మౌలిక సమస్య ఒకటే కనుక ప్రతి ఒక్కరూ ఈ పుస్తకాన్ని చదివి తీరాలి.

- కె.కె.

తెలుగుదనం నింపుకున్న శ్రీపాదనవలలు

వెల : రూ. 125/-;
ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు;

తీయని తెలుగు భాషా సౌందర్యాన్ని గుండెనిండా ఆస్వాదించాలంటే కేరాఫ్ అడ్రస్ శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి రచనలని అందరూ చెప్పుకొనేదే! కథకుడు, నవలాకారుడు, నాటకకర్త అయిన శ్రీపాద రచనల్ని అనేక ప్రయాసల కోర్చి ముద్రించటం హర్షించదగిన విషయం. "శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి నవలలు" శీర్షికతో ప్రచురించిన ఈ పుస్తకంలో 'ఆత్మబలి', 'నీలాసుందరి', 'క్షీరసాగర మథనం' అనే మూడు నవలలున్నాయి.

'ఆత్మబలి' నవల స్త్రీ పురుషుల లైంగికేచ్ఛను చర్చించినది. బాల్య వివాహాలు జరుగుతున్న కాలంలో భర్తను కోల్పోయిన యవ్వనవతులు మానసికంగా ఎంతటి ఘర్షణ పడ్తారో ఈ నవలలో చిత్రించారు. గ్రామీణ వాతావరణంలో సాగే ఈ నవలలో పల్లెటూరి ఆహ్లాదం, పల్లెల్లోని స్త్రీ పురుషుల సంబంధాలు చిత్రించారు. 'గోవిందమ్మ' భర్తను కోల్పోయిన యవ్వనవతి. ఒక కొడుకున్నాడు. యుద్ధంలో పాల్గొనేందుకు కొడుకు దూర ప్రాంతానికి వెళ్ళాడు. 'తిమ్మన్న' అల్లుడవుతాడు. గోవిందమ్మ మీద మనసుపడతాడు. గోవిందమ్మకు కూడా అల్లుడి మీద ఇష్టముంటుంది. కాని పరువు, గౌరవం ఎక్కడ పోతుందోననే భయం. 'తిమ్మన్న' తల్లి 'నారమ్మ' ఇద్దర్నీ 'కలిపే' ఏర్పాటు చేస్తుంది. అయితే అదే సమయానికి తన కొడుకు యుద్ధరంగంలో ధైర్యసాహసాలు ప్రదర్శించి పోలీసాఫీసర్గా వస్తున్నాడనే కబురు తెలుస్తుంది. తనలోని నైతికతకు, అనైతికతకు జరిగిన ఘర్షణలో 'తిమ్మన్న'ను కొడుకుగా భావించి, తన ఆత్మను కాపాడుకుంటుంది. ఇదీ కథ. కథ మంచి టెక్నిక్కుతో సాగుతుంది. చదువుతుంటే 'చలం' గుర్తొస్తాడు. అయితే నైతిక విలువల పట్ల గల నమ్మకం శ్రీపాదను గోవిందమ్మను 'తప్పు' చేయకుండా కాపాడేలా చేసింది. సహజాతమైన కామాన్ని అణుచుకోలేని తనం, అదుపులో పెట్టుకోని తనమే 'ఆత్మబలి' అనే టైటిల్‌తో సూచిస్తున్నాడు.

'నీలాసుందరి' కథ పౌరాణిక ఇతివృత్తంతో సాగింది. 'క్షీరసాగర మథనం' జమీందారీ స్త్రీల జీవితాన్ని ప్రతిబింబించేది. పురాణాలు, మహాభారతాది ఇతిహాసాల మీద గాఢమైన ప్రీతి ఆయన పాత్రల నామీకరణంలోనూ, వాతావరణ చిత్రణలోను, నైతిక విలువల్లోనూ కనిపిస్తుంది. శ్రీపాదను అర్థం చేసుకోవడానికి ఈ మూడు నవలలూ సహకరిస్తాయి.

- జిలుకర శ్రీనివాస్

శ్రీకారం

అమెరికాను భూతల స్వర్గంగా భావించి నగటు భారతీయ దృక్పథానికి భిన్నంగా ఈ వ్యాసాలు అమెరికన్ సమాజపు లక్షణాలను, పోకడలను, అక్కడ పెచ్చరిల్లుతున్న దారిద్ర్యం, నిరుద్యోగం, వర్ణవివక్ష, మహిళ స్థితిగతులు, బాలుర పరిస్థితులు, మతప్రభావం, యుద్ధోన్మాదం, డబ్బు సంస్కృతి, ఎన్నికల ప్రహసనం మొదలైన అనేకాంశాలపై రేఖామాత్రపు ప్రత్యేక దృష్టిని ఇందులోని వ్యాసాలు ప్రదర్శించాయి.

అమెరికాలంలో నీడలు - జాడలు
రచన : రవి, న్యూజెర్సీ; **వెల:** రూ. 15/-
ప్రతులకు : మైత్రీబుక్‌హౌస్, విజయవాడ; విశాలాంధ్ర అన్ని బ్రాంచీలు, ప్రజాశక్తి అన్ని బ్రాంచీలు; నవోదయ బుక్‌హౌస్, హైదరాబాద్, గుంటూరు, విజయవాడ; దిశ పుస్తక కేంద్రం, హైదరాబాద్; మణి బుక్‌స్టాల్, నెల్లూరు



కవిత్వం ప్రజల కోసమైతే ప్రజల్ని కేంద్ర బిందువుగా చేసుకొని చుట్టూ పరచుకుంటుంది. సమాజానికి కాపరి కదా కవి. ప్రజల పక్షాన వకాల్తా తీసుకుంటాడు. నిన్న టికి, నేటికి, రేపటికి అంతః సూత్రమై మానవుడు, సంఘం, ఉద్యమాలు, విప్లవాలు, చట్టాలపై రాయని చరిత్ర అవుతుంది కవిత్వం.

వెన్నెల పువ్వు
రచన : బి.హనుమారెడ్డి, **వెల :** రూ. 40/-,
ప్రతులకు : విశాలాంధ్రబుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు; బి.హనుమారెడ్డి, అధ్యక్షుడు, ప్రకాశం జిల్లా రచయితల సంఘం, రాజాపానగల్ రోడ్డు, ఒంగోలు

వ్యక్తిగత, కుటుంబ, మానసిక, సామాజిక, ఆర్థిక కోణాలలో ఎదురయ్యే సమస్యలను అధిగమించి విజయ వంతంగా ఎలా జీవించ వచ్చో వివరించే మనోవైజ్ఞానిక గ్రంథం

జీవితాన్ని జయించు...
రచన : హిప్నో పద్మాకమలాకర్; **వెల :** రూ. 35/-;
ప్రతులకు : జె.పి. పబ్లికేషన్స్, గాంధీనగర్, విజయవాడ

వంకాయ్...!

కొండబాబు

రవి పగలబడి నవ్వాడు మురళి వేసిన జోకుకు. ఆ శబ్దానికి రేణుక గరిటతోనే వచ్చేసింది వంటగదిలోంచి

"ఏంటి? నన్ను వంటకొదిలేసి మీరు జోకులేసుకుని నవ్వుకుంటున్నారు. మురళీ .. చూడూ .. పెళ్ళై నెలైనా కాలేదు 'మొగుడి' లాగ తయారయ్యాడు రవి" అంది రేణుక.

మురళి నవ్వుతూ .. "పదరా .. రేణుకి సాయం చేద్దాం" అన్నాడు.

"ఏంటి చేసేది వంకాయ్" అన్నాడు రవి రేణుని ఉడికిస్తూ.

"సరే .. అలాగే ఉండు.. నేనూ వంటచెయ్యను. గెస్ట్ కాబట్టి మురళి చేయడు. నీకేమయింది?" అంటూ ఇంతెత్తున లేచింది రేణుక. అంటూ తనూ వాళ్ళకెదురుగా కూర్చుండిపోయింది. వాతావరణం తేలిక చేస్తూ "ఇంతకూ కూరలేంటి రేణూ?" అన్నాడు మురళి.

"వంకాయ్.." అంది రేణుక

"వామ్మో.. వంకాయ..?! నాకొద్దు" అన్నాడు రవి

"గుత్తి వంకాయ కూరోయ్ మామా
కూర వండినానోయ్ మామా" అంటూ పాటందుకుంది రేణుక నవ్వుతూ.

"వంకాయ కేమైందిరా.."
వంకాయ వంటి కూరయూ
పంకజముఖి సీతవంటి భార్యామణియున్
ఎట్టట్రా ఎట్టట్రా.. కలదే?! అన్నారు మన పెద్దలు" అన్నాడు మురళి. వాళ్ళిద్దరూ నవ్వేశారు.

"లేవండి ముగ్గురం కలిసి వంటచేద్దాం" అంటూ తనే ముందు లేచాడు మురళి కొత్తగా పెళ్ళయిన తన ఫ్రెండ్స్ దంపతులను ఉత్సాహపరుస్తూ.

నిన్న మొన్నటి వరకు పంక్తి భోజనాల్లో వంకాయ మస్ట్‌గా ఉండవల్సిందే. అంత ప్రియమైనది తెలుగువారికి వంకాయ. కాని అసలు వంకాయ తెలుగువారిదేనా? ఆ పదం తెలుగుపదమేనా? అనేది ప్రశ్న.

మనదేశంలోనూ, బర్మాలోనూ ఇది కనిపిస్తున్నందున ఇది ఆసియా ఖండపు మొక్కే. కాని ఇది మనదేశందేననడంలో వివాదం ఉంది. వంకాయకు 'వంగ' అనే వ్యవహారం ఉంది. సంస్కృతంలో భంతాక, వార్తాక, వంగన, భన్తాక, వాతింగణ... ఇలా

విదేశీ సంస్కృతపండితుడు వాల్టర్ ఎలియాట్ భండాకి, హింగలీ, సింహీ, వార్త, వంగ, వేర అనే పర్యాయ పదాలిచ్చాడు.

సంస్కృతభవమైన హిందీలో బైగన్, భాంగన్, బ్రింజాల్ బదన్‌జన్, బెంగాలీలో బేగూన్, బోంగ్ ఒరియాలో బైసూన్, మరాఠీలో వాంగీ, బైగనా, గుజరాతీలో వేంగ్నీ, మలయాలంలో త్రోంగ్, సింహళీలో వాంబటు, అరబ్బీలో బెరంగన్ –ఇలా పిలుస్తారు.

ఇంగ్లీషులో బ్రింజాల్, పోర్చుగీస్‌లో బ్రింజెల్లాని బెరింగెల్లా, స్పానిష్‌లో చేరికజేనా, ఇటలీలో మెలంజానా అని పలుకుతారు.

వీటన్నింటిలోనూ బరింజ, బంగ, వంగ అనే ధ్వని వినిపించడం గమనార్హం. దీనిని బట్టి మూలపదం ఒక్కటే అయిఉండవచ్చుననిపిస్తుంది. ఈ మూలపదం 'వాతింగణ' అయి ఉంటుందని, 'వాతహరము' దీని అర్థమని పరిశోధకుల అభిప్రాయం.

వాతహరమనే అర్థం దాని ఉపయోగం, గుణం పరిశీలించాకే గదా వచ్చేది. కావున మూలపదం ప్రాంతీయంగా ఏర్పడి, గుణం నుంచి వ్యాప్తిలోకి వచ్చి ఉంటుందనుకోవచ్చు.

మలయాలోని త్రోంగ్ పదానికి వంగ వాచకాలైన ఇతర పదాలకూ గల శబ్దసామ్యాన్ని బట్టి ఇది ఆగ్నేయాసియా దేశాల మొక్క అనుకోవచ్చు. అక్కడి నుంచి మనదేశంలోని వంగ ప్రాంతానికి వచ్చి పూర్వ రూపాలతోసహా ప్రాచుర్యంలోకి వచ్చిందనుకోవచ్చు. తెలుగులో 'వంగకాయ' అనేదే ప్రాచీన రూపం. ఉచ్చారణా వేగంలో అది 'వంకాయ'గా మారింది.

వంకాయ వంటి కూర లేదనడం నేడు అత్యుక్తిగా మారింది. రుచిలో అమోఘం కాని, దానిలో పోషక పదార్థాలు అత్యల్పం అంటూ నేడు తేల్చేస్తున్నారు.

అందుకే కాబోలు ఆధునిక కుర్రకారు 'ఏమీ లేదనటానికీ', 'పట్టించుకోదగినది కాదనడానికీ' ఒకే మాటగా 'వంకాయ్..!' అనేస్తున్నారు. ఎవరెంత తీసేసినా రూపంలో దాని సొగసు, కూరల్లో దాని రుచీ మరి దేనికీ రావు కదా! ★

పాఠక స్పందన

దళిత యదార్థ గాథ

6-1-2002 ఆదివారం ప్రజాశక్తిలో ప్రచురించిన 'కామన్వెల్త్' కథ చాలా బాగుంది. ప్రైవేటీకరణలో దళితకు వున్న ప్రత్యేక రాజ్యాంగ చట్టాలు, రిజర్వేషన్స్ ఎలా వుంటాయో క్లుప్తంగా చెప్పే ప్రయత్నం చేసిన రచయిత బి.ఎస్.రాములు గారికి ధన్యవాదాలు ప్రజాశక్తి పత్రిక మొత్తం దళిత పక్షాన న్యాయం కావాలనే చేస్తున్న కృషి అభినందనీయం.

– లుంగాల రాజ సమ్మయ్య, ఆదిలాబాద్

ఆకట్టుకున్న పాండాల చరిత్ర

6వ తేదీ ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలో పాండాల గురించి ప్రచురించిన కవర్ స్టోరీ ఆకట్టుకుంది. ఎలుగుబంటి జాతికి చెందిన పాండాలను గురించి సమగ్ర వివరాలను ఇవ్వడం అభినందనీయం. టూరిస్ట్‌గైడ్‌లో నీలగిరులను గురించిన వివరాలు టూరిస్ట్‌లకు ఉపయోగకరంగా వున్నాయి. ఆరోగ్యం శీర్షికలో ధూమపానం వలన కలిగే అనర్థాలను గురించి తెలిపిన అంశాలు విజ్ఞానదాయకంగానూ, ఉపయోగకరంగానూ వున్నాయి. హ్యాపీబర్త్‌డే శీర్షికన ప్రారంభించబోవడం అభినందనీయం.

– జి.రమాదేవి, తహెర్‌ఖాన్‌పేట్, మెదక్

– ఆనందగజపతిరావు, తెట్టంగి, శ్రీకాకుళం

ధనమే ప్రధానమా ?

డిసెంబర్ 16, 23 తేదీల్లో ప్రచురించిన హిరణ్యాక్షుడు కథ ప్రస్తుత వాస్తవ పరిస్థితులను పాఠకుల కళ్ళెదుట నిలిపింది. టీవీలోని పాత్రలతో తాదాత్మ్యత చెందిన ఫలితంగా అప్పటివరకు జీవితంలో లేని లోటు మిన్నాగులా పడగవిప్పి ప్రజల శాంతియుత జీవితాన్ని కాటువేస్తున్నది. ఈ విషయాలను మనసుకు హత్తుకునేలా చెప్పిన రచయిత ధన్యవాదాలు.

– పి.ఎస్.ప్రసాద్, సామర్లకోట, తూ.గో.జిల్లా

ఉపయుక్తం కామెర్ల వ్యాసం

డిసెంబర్ 30 తేదీన ప్రచురించిన కామెర్లు వ్యాసం విజ్ఞాన దాయకంగా వుంది.

– కొడిమళ్ళ ఖాసిం, పాల్వంచ, ఖమ్మం జిల్లా

– డా॥ఎస్.సి.రావు, మల్లంపేట, విజయనగరం జిల్లా